తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
బుధవారం
13 మే 2026
పేజీలు : 08
Follow :



కొనసాగుతున్న అపార్ట్‌మెంట్ నిర్మాణం వద్ద బాధితుడు శ్రీనివాస్ రెడ్డి




గతంలో ఆ స్థలంలో ఉన్న ప్రైవేటు వ్యక్తులు (బౌన్సర్లు)

# ఈశ్వరా... ఏంటీ అరాచకం!!

## కోర్టు ఆదేశాలు బేఖాతరు.. బాధితుడికి బెదిరింపులు

- స్థలాన్ని ఆక్రమించి అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్న కార్పొరేటర్ భర్త
- నాడు, నేడు అధికార పార్టీలతో ఉంటూ ఆగడాలు
- సొసైటీ మనుగడలో లేని సమయంలో రిజిస్ట్రేషన్

**అధికార పార్టీల అండతో, అధికారులను నయనో భయానో బెదిరించో తన పనులు తాను చకచకా పూర్తి చేసుకుంటున్నాడు. ప్రభుత్వ నిబంధనలను, కోర్టు ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ కబ్జాలకు పాల్పడుతున్నాడు. ఇప్పటికే పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా నమోదుకాగా.. 'అధికార' ప్రోద్బలంతో తన ఆగడాలను మాత్రం ఆపలేదు. సొసైటీయే మనుగడ లేని కాలంలో బోగల్ ధ్రువపత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టు ఆరోపణలూ వెల్లువెత్తుతున్నాయి. అక్కడితో ఆగిపోకుండా బలవంతంగా ఆక్రమించుకున్న ఆ స్థలంలో అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్న సదరు మాజీ కార్పొరేటర్ భర్త చర్యల నుంచి తనను కాపాడాలని, తన ఇంటి స్థలం ఇప్పించాలని వేడుకుంటున్న ఓ బాధితుడి వేదన వర్ణణాతీతం..!**



బోడుప్పల్, మే 12 (జనంసాక్షి) :

వివరాల్లోకెళ్తే.. మేడిపల్లి మండలం పరవతాపూర్ గ్రామ పరిధిలో కొనసాగుతున్న భూముల వివాదం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంలో మాజీ కార్పొరేటర్ భర్త పేరు ప్రతివాదుల జాబితాలో ఉండగా, ఉప్పల్‌లోని రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కమ్ ఆరో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు కీలక మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఓఎస్ నెం. 40/2024కు సంబంధించి దాఖలైన ఐఏ నెం.189/2024 పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు, ఏప్రిల్ 29, 2026న ఉత్తర్వులు వెలువరించింది. కోర్టు ఆదేశాల ప్రకారం, ప్రతివాదిగా ఉన్న ఆయన, ఇతరులు సంబంధిత భూములపై ఎలాంటి విక్రయాలు, బదిలీలు, మూడో వ్యక్తులకు హక్కుల కల్పన లేదా ఎంకంబరెన్సులు సృష్టించే చర్యలు చేపట్టరాదని స్పష్టం చేసింది. అలాగే వివాదాస్పద ఆస్తిలో కొత్త నిర్మాణాలు, డెవలప్‌మెంట్ కార్యకలాపాలు చేపట్టకుండా ఉండాలని, అవసరమైన నిర్వహణ పనులు మాత్రమే నిర్వహించవచ్చని కోర్టు పేర్కొంది. కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి జరిగే ఏ లావాదేవీలైనా కేసు తుది తీర్పుకు లోబడి ఉంటాయని కూడా స్పష్టం చేసింది. ఈ కేసులో శ్రీరమణ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీతో పాటు పలువురు ప్రతివాదులుగా ఉన్నారు. భూముల యాజమాన్యం, హక్కులు, సంబంధిత లావాదేవీలపై వివాదం తలెత్తడంతో విషయం కోర్టు పరిధిలోకి వెళ్లింది.



### భూముల విలువ పెరగడంతో..

పర్వతాపూర్ ప్రాంతం గత కొంతకాలంగా రియల్ ఎస్టేట్ పరంగా వేగంగా అభివృద్ధి చెందడంతో భూముల విలువ పెరిగింది. ఈ నేపథ్యంలో యాజమాన్య హక్కులు, రిజిస్ట్రేషన్లు, లావాదేవీలకు సంబంధించిన వివాదాలు తరచూ వెలుగుచూస్తున్నాయి. ఇందులో మాజీ కార్పొరేటర్ భర్త పేరు రావడం గమనార్హం. అయితే.. ఈ వ్యవహారానికి సంబంధించిన ఆ సదరు భూమిని 2004లో శ్రీనివాస్‌రెడ్డి కొనుగోలు చేశారు. సదరు మాజీ కార్పొరేటర్ భర్త 2023 నుంచి ఆక్రమించాడు. అందులో 320 గజాల్లో అపార్ట్‌మెంట్ నిర్మాణం మొదలు పెట్టాడు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన శ్రీనివాస్‌రెడ్డిపై బెదిరింపులు మొదలు పెట్టాడు. దీంతో 2024 శ్రీనివాస్‌రెడ్డి కోర్టును ఆశ్రయించగా.. ఆ నిర్మాణాలను నిలుపుచేయాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు కూడా ఇచ్చింది. ఉప్పల్ మేజిస్ట్రేట్ కోర్టులో తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు ఎక్కడి పనులు అక్కడే నిలిపివేయాలని ఆదేశించింది. ఆ ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ అధికారులను సైతం బెదిరిస్తూ పనులను చకచకా పూర్తి చేస్తూ వస్తున్నారు. దీనిపై శ్రీనివాస్‌రెడ్డి మున్సిపల్ కమిషనర్‌కు, డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అయినా ఫలితం లేకపోయింది. అటు కోర్టు ఉత్తర్వులను, ఇటు మున్సిపల్ అధికారుల ఆదేశాలను పట్టించుకోకుండా, బెదిరింపులకు గురిచేస్తూ నిర్మాణాన్ని పూర్తి చేస్తూ వస్తున్నారు. ఈ వ్యవహారంలో అధికారులు ఏం చేస్తున్నారో మరి..!?

# క్రీడా మైదానాలు, పార్కుల అభివృద్ధికి శ్రీకారం



**రాజేంద్రనగర్,మే12(జనంసాక్షి)** రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని అన్ని సర్కిళ్లలో ఉన్న క్రీడా ప్రాంగణాలు పార్కులను అభివృద్ధి పరచడమే ధ్యేయంగా కృషి చేస్తున్నామని జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి, ఎస్.ఈ నరేందర్ గౌడ్, డి.ఈ.ఈ యాదయ్యలు కలిసి పని క్రీడా మైదానాలను సందర్శించి పరిశీలించారు. ప్రజలకు మెరుగైన క్రీడా, వినోద సదుపాయాలు కల్పించే లక్ష్యంతో అనువైన ప్రదేశాలను గుర్తించి, అభివృద్ధి చర్యల కోసం కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు. ఈ పరిశీలనలో అధికారులు ప్రాంగణాల ప్రస్తుత పరిస్థితులను సమీక్షించి, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. రాజేంద్రనగర్ జోన్‌లో ప్రజలకు మరింత మెరుగైన క్రీడా వసతులు, పచ్చదనం ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించే దిశగా పార్కులు, క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని అధికారులు తెలిపారు..

# సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన శ్రీకాంత్‌రెడ్డి



**బంట్వారం మే 12 (జనం సాక్షి)** బంట్వారం మండల కేంద్రంలో అనారోగ్య సమస్యలతో చికిత్స పొందిన వారి వైద్య ఖర్చుల నిమిత్తం చేవెళ్ల పార్లమెంటు సభ్యులు ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సహకారంతో రొంపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు అయ్యాయని బీజేపీ జిల్లా నాయకుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు చేవెళ్ల పార్లమెంటు ఎంపీ కార్యా లయంలో మౌనికకు రూ.60 వేలు, బి.నిర్మల మ్మకు రూ.15 వేలు చెక్కులు అందజేశామని చెప్పారు.

# పీఎం మోదీ సూచనలను పాటిద్దాం.. దేశాన్ని అభివృద్ధి చేద్దాం!



**రాజేంద్రనగర్,మే12(జనంసాక్షి)** దేశాన్ని అభివృద్ధి చెందిన భారతంగా తీర్చిదిద్దేందుకు ప్రధాని నరేంద్ర మోదీ సూచిస్తున్న మార్గాలను ప్రతి భారతీయుడు పాటించాలని కిస్మత్‌పూర్ మాజీ ఉపసర్పంచ్, రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యుడు నిరుడు శేఖర్ ముదిరాజ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని తెలిపారు. పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించి ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచాలని సూచించారు. ప్రతి ఇంటిపై సోలార్ విద్యుత్ వ్యవస్థలు ఏర్పాటు చేసుకోవాలని, నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. సహజ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం వల్ల రైతులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు.డిజిటల్ లావాదేవీలు విస్తృతంగా వినియోగించడం ద్వారా పారదర్శకత పెరుగుతుందని, "మేక్ ఇన్ ఇండియా" ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా దేశీయ పరిశ్రమలకు ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేద, మధ్యతరగతి కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశ అభివృద్ధిలో యువత ముందుండాలని, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని నిరుడు శేఖర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు.


# మురుగు కూపంగా బంట్వారం.. పారిశుద్ధ్యం సున్నా



బంట్వారం మే 12 (జనం సాక్షి) బంట్వారంలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెత్త సేకరణ బండికి కేవలం డ్రైవర్ను మాత్రమే పంపుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బండి ఎత్తుగా ఉండటంతో చెత్త వేయలేక అవస్థలు పడుతున్నామని వృద్ధులు, మహిళలు వాపోతున్నారు. కాలనీ కాలనీలకు రోజుల తరబడి గ్రామపంచాయతీ పారిశుద్ధ ట్రాక్టర్ రాకపోవడంతో సమస్య మరింత తీవ్రమైందని గ్రామ ప్రజలు చెబుతున్నారు. అదనపు సిబ్బందిని నియమించాలని వారు కోరుతున్నారు.

# సేవే వారి మతం.. మానవత్వమే వారి పథం

- రోగుల పాలిట నర్సులు చేస్తున్న పోరాటం అభినందనీయం
- తెల్ల దుస్తుల్లో మానవత్వం... నర్స్ డే సందర్భంగా ప్రత్యేక నివాళి
- రోగికి ధైర్యం... కుటుంబానికి నమ్మకం... నర్సుల సేవ అమూల్యశీ
- కరోనా నుంచి కాపాడిన కరుణామూర్తులు... నర్సులకు జోహార్లు



కూకట్ పల్లి, మే 12(జనంసాక్షి ): ఆసుపత్రిలో రోగి అడుగు పెట్టిన క్షణం నుంచి కోలుకుని ఇంటికి వెళ్లే వరకు అండగా నిలిచేది నర్సులే. వైద్య సేవల్లో డాక్టర్ల తర్వాత అత్యంత కీలక పాత్ర పోషించే నర్సులు తమ సేవా భావంతో లక్షలాది మంది ప్రాణాలను కాపాడుతున్నారు. ప్రతి ఏడాది మే 12న ప్రపంచవ్యాప్తంగా "అంతర్జాతీయ నర్సుల దినోత్సవం"ను ఘనంగా నిర్వహిస్తారు. ఆధునిక నర్సింగ్ వ్యవస్థకు పునాది వేసిన ఫ్లోరెన్స్ నైటింగేల్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు. పగలు రాత్రి తేడా లేదు పగలు -- రాత్రి తేడా లేకుండా రోగుల సేవలో నిమగ్నమై ఉండే నర్సులు ఎంతో ఓర్పు, మానవత్వంతో విధులు నిర్వర్తిస్తున్నారు. కరోనా మహమ్మారి సమయంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలు అందించి "ఫ్రంట్ లైన్ వారియర్స్"గా గుర్తింపు పొందారు. కుటుంబాలను దూరం పెట్టి ఆసుపత్రులలోనే ఉండి రోగులకు ధైర్యం చెప్పిన ఘటనలు ఇప్పటికీ ప్రజల మదిలో నిలిచిపోయాయి. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో పని చేస్తున్న నర్సులు తీవ్ర ఒత్తిడి, సిబ్బంది కొరత, ఎక్కువ పని గంటల మధ్య కూడా చిరునవ్వుతో సేవలు అందిస్తున్నారని ప్రజలు కొనియాడుతున్నారు. ఒక వైపు మందులు, చికిత్సలు అందించడమే కాకుండా రోగులకు మానసిక ధైర్యం ఇచ్చే బాధ్యతను కూడా నర్సులే భుజాన వేసుకుంటున్నారు. ఈ సందర్భంగా పలువురు వైద్య నిపుణులు మాట్లాడుతూ "రోగి త్వరగా కోలుకోవడంలో నర్సుల పాత్ర అత్యంత కీలకం. వారి సేవలు అమూల్యం" అని అభినందించారు. సమాజ ఆరోగ్య రక్షణలో నర్సుల సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.

# బంట్వారం మండల కేంద్రంలో ప్రారంభమైన జనాభా లెక్కల సేకరణ!

## జనగణన ఇండ్ల సర్వే ప్రారంభించిన డిప్యూటీ తహసీల్దార్ మహేష్



బంట్వారం,మే 12( జనం సాక్షి) బంట్వారం మండల కేంద్రంలో సోమవారం మండల డిప్యూటీ తహసీల్దార్ మహేష్ ఎనిమినిరేటర్లతో కలిసి ఇండ్ల సర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రభుత్వ ఆదేశానుసారం జనగణన చేయ టం జరుగుతుందని మండలంలోని ప్రతి గ్రామానికి ఎనిమినిరేటర్ సూపర్ వైజర్ రావటం జరుగుతుందని గ్రామాలలో ప్రజలు సహకరించి పూర్తి సమాచారాన్ని వారికి అందజేయాలని సూచించారు. ముందుగా మొదటి దశలో ఇండ్ల సర్వే చేపట్టడం జరుగుతుందని తెలిపారు.తరువాత కుటుంబ వివరాలు సేకరించ టం జరుగుతుందని అన్నారు. ఈ సర్వే పారదర్శకంగా నిర్వహించటం జరుగుతుందని ఎలాంటి తప్పు లు దొరల కుండా ఎన్యూమరేటర్లు జాగ్రత్త వహించాలని అన్నారు. అధికారులు సూపర్ వైజర్లు ఎన్యూమరేటర్లు జిపిఓలు తదితరులు పాల్గొన్నారు.

# అద్విక్ ఆరోగ్యంపై ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆరా



**హయత్ నగర్, మే 12 (జనం సాక్షి)** బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీ ఫేజ్–2 నందు సోమవారం రాత్రి జరిగిన వీధి కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడి కామినేని హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాలుడు అద్విక్‌ను ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా బాలుడి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న సుధీర్ రెడ్డి, మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి వైద్య సిబ్బందికి సూచించారు. అద్విక్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, బాలుడి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. నియోజకవర్గం లో వీధి కుక్కల సమస్యపై సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

# వేసవి శిక్షణ శిబిరానికి శ్రీకారం




**బంట్వారం మే 12 (జనం సాక్షి)** బంట్వారం మండల కేంద్రంలో ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బంట్వారం మోడల్ స్కూల్లో ఎడ్యుకేషన్ వీక్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా 6 నుండి 9వ తరగతి విద్యార్థుల కోసం సమ్మర్ క్యాంప్ను ప్రారంభించారు. మే 25 వరకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. విద్యానైపుణ్యాలాభివృద్ధి కి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని ప్రిన్సిపల్ బ్యూలా తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్‌లో మారుమోగిన మారుతి నామస్మరణ

- దేవాలయాలను సందర్శించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి
- భక్తులతో కళకళలాడిన ఆలయాలు.. ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు





**ఉప్పల్, మే 12 ( జనం సాక్షి ):** ఉప్పల్ నియోజకవర్గం వ్యాప్తంగా హనుమాన్ జయంతి వేడుకలు భక్తి శ్రద్ధల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఉదయం నుంచే ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొనగా, భజనలు, ప్రత్యేక పూజలు, హనుమాన్ చాలీసా పారాయణాలతో ఆధ్యాత్మిక వాతావరణం అలుముకుంది. కమలనగర్, కుషాయిగూడ, హబ్సిగూడ, ఉప్పల్ పరిసర ప్రాంతాల్లోని ప్రముఖ హనుమాన్ దేవాలయాలు విద్యుత్ దీపాలతో అలంకరించబడగా, భక్తులతో కిక్కిరిసిపోయాయి. హనుమాన్ జయంతి సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కమలనగర్, కుషాయిగూడ ప్రాంతాల్లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. భారీ హనుమాన్ టెంపుల్‌తో పాటు స్థానిక శివాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, శ్రీ ఆంజనేయ స్వామి భక్తి, బలం, ధైర్యం, సేవాభావానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆంజనేయస్వామి ఆశీస్సులతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. సమాజంలో ఐక్యత, పరస్పర సహకారం, ధార్మిక చైతన్యం పెంపొందించడంలో ఇలాంటి పండుగలు ముఖ్యపాత్ర పోషిస్తాయని అన్నారు. యువత మంచి మార్గంలో నడవాలని, సేవా భావాన్ని అలవరుచుకోవాలని సూచించారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయాల్లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మహిళలు, యువకులు, చిన్నారులతో కలిసి కొంతసేపు భక్తి కార్యక్రమాలను వీక్షించారు. ఎమ్మెల్యే రాకతో స్థానిక నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చారు. ఇదే సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి హబ్సిగూడలోని ఎన్‌జీఆర్ఐ అభయ ఆంజనేయ స్వామి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక అర్చనలు, హారతుల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఉప్పల్ నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆంజనేయస్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, హనుమాన్ జయంతి కేవలం ఆధ్యాత్మిక వేడుక మాత్రమే కాకుండా ధైర్యం, క్రమశిక్షణ, సేవాభావాన్ని గుర్తు చేసే పర్వదినమని అన్నారు. యువతలో భక్తి భావం పెంపొందాలని, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని ఆకాంక్షించారు. ప్రజలంతా కలిసి పండుగలను జరుపుకోవడం ద్వారా సామాజిక ఐక్యత మరింత బలపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఈఓ వెంకన్న, దేవాలయ కమిటీ సభ్యులు బికుమల్ల అంజయ్య గుప్తా, ఈగ అంజనేయులు, తుమ్మల దేవిరెడ్డి, బుసం రఘునాథ్ రెడ్డి, వర్కాల మదన్ గౌడ్, కడప నర్సింగ్, కిషన్ నాయక్, సంతోష్ కుమార్, రవి శర్మ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు కంది శ్రవణ్ రెడ్డి, రాజన్న, మాలు నాయక్‌తో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా ఎమ్మెల్యేతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వివిధ ఆలయాల్లో భజన మండళ్లు నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కొందరు భక్తులు హనుమాన్ దీక్షలతో ప్రత్యేక దర్శనాలు చేసుకోగా, పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఉప్పల్ నియోజకవర్గంలోని పలు దేవాలయాల్లో రోజంతా భక్తుల రద్దీ కొనసాగింది. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. హనుమాన్ జయంతి వేడుకలతో ఉప్పల్ ప్రాంతం మొత్తం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, సామాజిక ప్రముఖులు పాల్గొనడంతో వేడుకలు మరింత ప్రత్యేకతను సంతరించుకున్నాయి.

# నైరుతి రాకకు ముందే రక్షణ చర్యలు

ఉప్పల్, మే 12 (జనం సాక్షి): వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ఉప్పల్, చిలుకనగర్ ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తమయ్యారు. వర్షాల సమయంలో నీటి నిల్వలు, కాలనీల్లో ముంపు సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా నాలాల పూడికతీత పనులను వేగవంతం చేస్తున్నారు. ఈ క్రమంలో జీహెచ్ఎంసీ సిబ్బంది మంగళవారం ఉదయం ఉప్పల్, చిలుకనగర్ పరిధిలోని పలు ప్రధాన నాలాలను పరిశీలించారు. నాలాల్లో పేరుకుపోయిన చెత్త, మట్టి, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించే పనులను పరిశీలిస్తూ అధికారులకు పలు సూచనలు చేశారు. వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా అడ్డంకులు లేకుండా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. ప్రత్యేకంగా గతంలో వర్షాల సమయంలో నీరు నిలిచిన ప్రాంతాలను గుర్తించి అక్కడ పూడికతీత పనులు మరింత సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. పలు కాలనీల్లో స్థానిక ప్రజలతో మాట్లాడిన జీహెచ్ఎంసీ సిబ్బంది, వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉప్పల్, చిలుకనగర్ ప్రాంతాల్లో కొనసాగుతున్న నాలాల పూడికతీత పనులతో స్థానికులు సంతృప్తి వ్యక్తం చేశారు. వర్షాకాలానికి ముందే పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# అధికారం కోల్పోయిన ఆవేదనతోనే బీఆర్ఎస్ దీక్షలు

### కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి:కావలి సంతోష్



**తాండూరు మే 12(జనంసాక్షి)** రైతుల పేరుతో బీఆర్ఎస్ పార్టీ చేస్తున్నవి దొంగ దీక్షలేనని, ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లోనే రైతులు ఆ పార్టీకి గట్టిగా బుద్ధి చెప్పారని జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కావలి సంతోష్ ధ్వజమెత్తారు. సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో బీఆర్ఎస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "బీఆర్ఎస్ పార్టీకి సిగ్గు రావాలి. మీరు ఎన్ని దీక్షలు చేసినా తెలంగాణలో అన్నదాతలు కాంగ్రెస్ వైపే ఉన్నారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం అన్ని పథకాలు రేవంత్ సర్కార్ అమలు చేస్తోంది" అని ఆయన పేర్కొన్నారు.రేవంత్ ప్రభుత్వం అమలు చేస్తున్న 7 కీలక రైతు పథకాలను ఆయన వివరించారు.రైతు భరోసా ఎకరాకు ఏడాదికి రూ.12,000. ఖరీఫ్‌కు రూ.6,000, రబీకి రూ.6,000 చొప్పున పంట వేసిన భూమికి మాత్రమే. రూ. 2 లక్షల రుణమాఫీ 25 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల వరకు ఒకేసారి రుణమాఫీ. రూ18,000 కోట్లు నేరుగా ఖాతాల్లో జమ.ఇందిరమ్మ ఆత్మీయ భరోసా: భూమి లేని కౌలు రైతులకు ఏడాదికి రూ.12,000 ఆర్థిక సాయం.వరి ధాన్యానికి రూ.500 బోనస్: సన్న వడ్లకు యం.ఎస్.పి రూ.2,300 కు అదనంగా క్వింటాల్‌కు రూ.500 బోనస్. మొత్తం రూ. 2,800.వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంట్ నెలకు రూ.5,500 కోట్లు వెచ్చిస్తూ నిరంతర ఉచిత విద్యుత్.పంట నష్టపరిహారం రూ.10,000 వర్షాలు, కరువుతో నష్టపోతే ఎకరాకు రూ10,000. వేగంగా చెల్లింపులు.ఇంటికి 200 యూనిట్ల ఉచిత కరెంట్: రైతు కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు గృహ విద్యుత్ ఉచితం."పదేళ్లు అధికారంలో ఉండి రైతులను మోసం చేసిన బీఆర్ఎస్ ఇప్పుడు దొంగ దీక్షలతో మళ్లీ నమ్మించాలని చూస్తోంది. కానీ రైతన్నలు అన్నీ గమనిస్తున్నారు. అందుకే సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తగిన బుద్ధి చెప్పారని కావలి సంతోష్ వ్యాఖ్యానించారు.

# కేంద్ర వైద్యారోగ్య శాఖ మంత్రి రాజీనామాకు పట్టు!

### బాలల హక్కుల సంక్షేమ సంఘం డిమాండ్

### నీట్ లీక్.. నైతిక బాధ్యత ఎవరిది? రాజీనామాకు డిమాండ్!



**హయత్ నగర్, మే 12 (జనం సాక్షి)** ఇటీవల దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ యు.జిఎగ్జామ్ పేపర్ లీకయ్యిందని, ఈ యేడు నిర్వహించిన పరీక్షను రద్దు చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించడం చేతకాని కేంద్ర ప్రభుత్వం 23లక్షల ల మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడడమేనని బాలల హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్ అన్నారు. ఏడాది పొడవునా కష్టపడి చదివిన దాదాపు 23 లక్షలమంది విద్యార్థులు తీవ్ర మానసిక ఆందోళనలో ఉన్నారు. రాజస్థాన్ లోని సీకర్ జిల్లా లో ఈ లీక్ వ్యవహారానికి సెంటర్ పాయింట్ అని ఇప్పటి వరకూ జరిపిన ప్రాథమిక ఇన్వెస్టిగేషన్ ప్రకారం తేలింది. "ఎస్ కే కన్సల్టెన్సీ" నడుపుతున్న రాకేష్ మాండవారియా అనే వ్యక్తి చేతికి పరీక్షకు 15 రోజుల ముందే నీట్ పేపర్ చేరిందని తెలుస్తుంది.2024, 2025 నీట్ ప్రశ్నాపత్రం లీకైన ఉదంతం నుంచి ఇప్పటికీ గుణపాఠం నేర్చుకోకపోవడం వల్లే ఈ సంవత్సరం కూడా ఈ దుస్థితి దాపురించిందనీ వారన్నారు. దర్యాప్తులో బయటపడ్డ అత్యంత షాకింగ్ విషయం ఏమిటంటే నిందితుల వద్ద దొరికిన 410 ప్రశ్నల గెస్ పేపర్లో దాదాపు 60 ప్రశ్నలు అసలు నీట్ పరీక్షలో వచ్చిన ప్రశ్నలతో అక్షరం పొల్లు పోకుండా ఉండటమే. ముఖ్యంగా కెమిస్ట్రీ 120 ప్రశ్నలలో ఎక్కువ శాతం ప్రశ్నలు నిందితులు ముందుగానే విద్యార్థులకు షేర్ చేసిన గెస్ పేపర్లో ఉన్నాయని దర్యాప్తులో బయటపడినట్లు అధికారులు తెలిపారు. ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారానికి నైతిక బాధ్యతగా కేంద్ర వైద్య, ఆరోగ్య, వైద్య విద్య శాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలి డిమాండ్ చేస్తున్నాము. బాధ్యులైన వాళ్లందరినీ పట్టుకుని కఠినంగా శిక్షించాలి, సాధ్యమైనంత త్వరగా మళ్లీ నీట్ పరీక్షను అత్యంత పకడ్బందీగా నిర్వహించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలనీ బాలల హక్కుల సంక్షేమ సంఘం కోరుతుంది.

# అర్హులైన ఎల్ 3 దరఖాస్తుదారులందరికీ ఇంద్రమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

### శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి



**తాండూరు మే 12(జనంసాక్షి)** ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వాహనాలు తదితర కారణాలతో అన్హరులుగా పరిగణింప బడి ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు నోచుకోని వారికి సైతం ఇళ్ల నిర్మాణానికి అవకాశం ఇవ్వాలని శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు.మంగళవారం హైదరాబాద్ లోని నారాయణ గూడ లో గల రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కేంద్ర కార్యాలయంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్థాయి గృహ నిర్మాణ,రెవెన్యూ అంశాల ఉన్నత స్థాయి సమిక్ష లో శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు లతో కలిసి ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఎల్ 3, ఎల్ 1 నిర్మాణాల కోసం ఉన్న చిన్న చిన్న అడ్డంకులను అధికారులు రాష్ట్ర మంత్రులకు ఉన్నతాధికారులకు వివరిస్తూ ఇందిరమ్మ ఇళ్ళను నిర్మించుకొని తమ సొంతింటి కలలను సకారం చేసుకునేందుకు అవకాశం కల్పించాలని సూచించారు. భూముల అమ్ముకొని కార్లు కొంటే, ఆ కుటుంబంలో ఇద్దరు ముగ్గురు భార్య భర్తలు ఉన్నా వారికి ఇల్లు రావడం లేదని, అది ఇళ్ళ నిర్మాణానికి అనర్హత ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు. అలాగే డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల మంజూరి ప్రక్రియలో 5 కిలోమీటర్ల దూరం లోపల ఉన్నవారికి మాత్రమే ఇళ్ల మంజూరి ఇవ్వాలనే నిబంధన సరికాదని, ఇది ఇల్లు లేని నిరుపేదలకు శాపంగా మారుతుందని అభిప్రాయపడ్డారు. నియోజకవర్గంలోని ఎవరైనా ఇల్లు లేని వారు మంజూరీకి అర్హులుగా ఉండేలా నిబంధనలను మార్చాల్సి ఉంటుందని మహేందర్ రెడ్డి సూచించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 35వేల నలభై మూడు జిల్లా మంజూరి ప్రభుత్వం ఇచ్చిందని వీటిలో కలెక్టర్ ల మంజూరి జరిగిన చాలా ప్రాంతాలలో తక్కువ స్థాయిలోనే ఇళ్ల నిర్మాణాలు ఇప్పటివరకు పూర్తయ్యాయని వాటిని వేగవంతం చేయాలని సూచించారు. తాండూర్ నియోజకవర్గంలో 3384 ఇంద్రమ్మ ఇల్లు మాత్రమే ప్రారంభం అయ్యాయని మరో 930 ఇళ్ల నిర్మాణాలు ఇంకా ప్రారంభం కాలేదని ఇలాంటి జాప్యం ఉండకూడదని ఆయన తెలిపారు. అలాగే తాండూర్ పరిసర కోకట్ ప్రాంతంలో మంజూరైన డబుల్ బెడ్ రూమ్ ఇల్లు 1001 మంజురుకాగా వీటిలో కేవలం 581 మాత్రమే పూర్తి చేయబడ్డ దశలో ఉండగా 288 డబుల్ బెడ్ రూంలో నిర్మాణాలు అసలు ప్రారంభం కాలేదని ఆయన అన్నారు. ఈనెల 25వ తేదీన రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి, పరిశ్రమల శాఖ జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబు తదితరుల పర్యటన నాటి కంటే ముందే ఈ ఇళ్ల నిర్మాణాలను అధికారులు ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయించాలని ఆయన అన్నారు.సమిక్ష లో మేడ్చల్, రంగారెడ్డి, వికారాబాద్ కలెక్టర్ లు మనూ చౌదరి, నారాయణ రెడ్డి, దీపక్ తివారి, ఎమ్మెల్యేలు మల్లారెడ్డి,అరికేపూడి గాంధీ, లక్ష్మారెడ్డి, మనోహర్ రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర రెడ్డి,ఎమ్మెల్సీలు, హౌసింగ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆంజనేయ స్వామి విగ్రహ వార్షికోత్సవం

## హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు,పాల్గొన్న డివిజన్ ప్రెసిడెంట్ వంగాల సంతోష్ గుప్తా



**రామంతాపూర్, మే 12 (జనం సాక్షి):** రామంతాపూర్ శ్రీనగర్ కాలనీలోని శ్రీ భక్త ఆంజనేయ స్వామి దేవాలయంలో అభయ ఆంజనేయ స్వామి వారి విగ్రహ ప్రథమ వార్షికోత్సవం మరియు హనుమాన్ జయంతి వేడుకలు భక్తి శ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించబడ్డాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం విద్యుత్ దీపాలు, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించబడగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఆలయంలో గణపతి పూజ, రక్షాబంధనం, పూర్ణకుంభ స్వాగతం, పూర్ణాహుతి, మహాదాశీర్వచనం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య అర్చకులు ప్రత్యేక హోమాలు నిర్వహించగా భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. హనుమాన్ చాలీసా పారాయణం, భజన కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామంతాపూర్ డివిజన్ ప్రెసిడెంట్ వంగాల సంతోష్ గుప్తా హాజరయ్యారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు శాలువాతో సన్మానం చేసి ఘనంగా ఆహ్వానించారు. కార్యక్రమం సందర్భంగా భక్తులు "జై శ్రీరామ్", "జై హనుమాన్" నినాదాలతో ఆలయ ప్రాంగణాన్ని మార్మోగించారు. ఈ సందర్భంగా వంగాల సంతోష్ గుప్తా మాట్లాడుతూ, హనుమాన్ జయంతి వేడుకలు ప్రజల్లో భక్తి, ధైర్యం, సేవాభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. యువత ఆంజనేయస్వామి ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుండాలని సూచించారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంచుతాయని పేర్కొన్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు పెంటం శైలేందర్, ఆలయ కమిటీ సభ్యుడు రామబ్రహ్మం, శ్రీనగర్ కాలనీ ప్రెసిడెంట్ సందీప్, కాలనీ వాసులు ఎంఎస్ యాదవ్, యాదగిరి, రాజమౌళి, జగ్గారెడ్డి, ఉదయ్ కుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. మహిళలు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజల్లో భాగస్వాములయ్యారు. హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకలు శ్రీనగర్ కాలనీలో భక్తి వాతావరణాన్ని నెలకొల్పగా,భక్తుల జైశ్రీరామ్ నినాదాలతో ప్రాంతం మార్మోగిపోయింది.

# అన్నదాత ఆవేదన.. కాంగ్రెస్ నేతల రాజకీయ విన్యాసాలు

- రైతు రోడ్డెక్కితే విమర్శలు చేయడం సిగ్గు చేటు
- మున్సిపల్ బిఆర్ఎస్ కౌన్సిలర్ ఇర్షద్



**తాండూరు మే 12(జనంసాక్షి)** రైతు ఏడుస్తుంటే కాంగ్రెస్ నేతలు రాజకీయాలు చేస్తున్నారని మున్సిపల్ కౌన్సిలర్ ఇర్షద్ పేర్కొన్నారు. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ నేతలు రైతుల కోసం ధర్నా చేస్తే ఓర్వలేక కాంగ్రెస్ పార్టీ పేపర్ స్టేట్మెంట్లు ఇవ్వడం వాళ్ల అసలు బుద్ధిని బయటపెట్టిందని ఇర్షద్ విమర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎడవ వార్డు కౌన్సిలర్ ఇర్షద్ మాట్లాడుతూ ప్రజలు తిరస్కరించిన పార్టీ ఇప్పుడు రైతుల పేరుతో డ్రామాలు చేస్తోందన్నారు.సిగ్గు శరం ఉంటే రైతులకు బకాయిలు విడుదల చేసి రైతులకు న్యాయం చేయాలన్నారు.అది చేతకాక పోతే రైతుల కోసం పోరాడుతున్న వారిపై మాట్లాడే హక్కు కూడా మీకు లేదన్నారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు గాలిలో కలిశాయి రైతు భరోసా,రుణమాఫీ,సహాయం ఎక్కడా అని ప్రశ్నించారు.కాంగ్రెస్ పార్టీకి రైతుల బాధలు కాదు... కుర్చీలు మాత్రమే ముఖ్యమన్నారు. రైతు కోసం పోరాడేది టీఆర్ఎస్ పార్టీ మాత్రమేనన్నారు.మాటలు కాదు... పోరాటమే మా సమాధానమన్నారు.రైతు శాపం తగిలితే ఏ ప్రభుత్వం నిలబడదని గుర్తుచేశారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు... సమయం వచ్చినప్పుడు గట్టిగా సమాధానం చెబుతారని వెల్లడించారు.

# భద్రత విషయంలో రాజీ లేదు.. అలసత్వానికి తావు లేదు

- దొంగతనాల కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, నిందితులను త్వరగా పట్టుకోవాలి
- అనుమానితులపై నిరంతరం నిఘా ఉంచాలి
- తాండూరు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ
- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా






**తాండూరు మే 12జనంసాక్షి)** ప్రజల భద్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా పేర్కొన్నారు. మంగళవారంవికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా తాండూరు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ ప్రాంగణాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని పలు కీలక రికార్డులను, క్రైమ్ రిజిస్టర్లను మరియు పెండింగ్ కేసుల స్థితిగతులను ఆమె నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల భద్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని, ముఖ్యంగా పట్టణంలో దొంగతనాల కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, నిందితులను త్వరగా పట్టుకోవాలని అధికారులను ఆదేశించారు.రానున్న బక్రీద్ పండుగను పురస్కరించుకుని తాండూర్ పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ స్పష్టం చేశారు. స్థానిక మత పెద్దలు, ప్రముఖులతో తక్షణమే పీస్ కమిటీ (శాంతి కమిటీ) సమావేశాలను ఏర్పాటు చేసి, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కమ్యూనల్ అంశాలకు సంబంధించి పాత నేరస్తులు, రౌడీ షీటర్లు మరియు అనుమానితులపై నిరంతరం నిఘా ఉంచాలని, అవసరమైతే వారికి కౌన్సిలింగ్ నిర్వహించాలని ఆదేశించారు.కేసుల దర్యాప్తులో జాప్యం జరగకుండా పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలని, రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించి, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం ద్వారా ప్రజల్లో పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని పెంపొందించాలని ఎస్పీ స్నేహ మెహ్రా గారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో తాండూర్ ఇన్స్పెక్టర్ పరమేశ్వర్ స్థానిక పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా విద్యా వారోత్సవాలు




**అంబర్పేట్ మే 12( జనం సాక్షి)** విద్యా వారోత్సవాల రెండవ రోజు రెమెడియన్ క్లాసెస్ జి హెచ్ ఎస్ ఆజాం పుర( లంక) లో నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నమెంట్ బాయ్స్ హై స్కూల్ హిమాయత్ నగర్ సి పి ఎల్ అంబర్పేట్ ప్రధానోపాధ్యాయురాలు సుశీల మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులకు రెమెడియన్ క్లాసెస్ ఎంతో ఉపయోగపడతాయని, విద్యార్థులు ఇష్టపడి చదవాలి అని తెలియజేశారు. మా పాఠశాల విద్యార్థిని జోయ జరీన్ అంబర్పేట్ మండలంలో టాపర్గా నిలిచినందుకు మా పాఠశాల ఉపాధ్యాయులకు విద్యార్థులకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. విద్యార్థులకు చదువు యొక్క ప్రాముఖ్యతను వివరించారు, విద్యార్థులంతా బాగా చదువుకొని ఉన్నత స్థాయిలో వెలగాలని ఆమె ఆకాంక్షించారు. చదివే అన్నిటికీ మూలమని, అలాంటి చదువును మనం దూరం పెట్టరాదని అన్నారు. పాఠశాల ప్రారంభం రోజె విద్యార్థులకు వివిధ వస్తువులతో కూడిన కిట్లు అందజేయనున్నారు, ఈ కిట్లో యూనిఫాం, స్కూల్ బ్యాగ్, క్రీడా వస్తువులు, విద్యార్థులకు అవసరమైన ఇతర సామాగ్రి ఉంటుందని తెలిపారు. ఈ సంవత్సరం పాఠశాల,కళాశాల, విద్యాసంస్థల విద్యార్థులు డ్రగ్స్ వ్యసనాలకు బానిసలు కాకుండా చూడాలని అవసరమైన చర్యలు తీసుకోవాలని పాఠశాల మరియు విద్యాశాఖ పోలీస్ శాఖ ఈగల్ సంయుక్తంగా సామూహిక ప్రతిజ్ఞ విద్యార్థులచే చేయించనున్నారు. విద్యాసంస్థలను సురక్షితంగా డ్రగ్ రహితంగా, నేరరహితంగా చక్కటి ఆహ్లాద వాతావరణంలో విద్యార్థులకు చక్కటి బోధన చేపడతారని చెప్పారు. పాఠశాలలు, కళాశాలల పరిధిలో పొగాకు, మద్యం, మాదకద్రవ్యాల వ్యసనాలకు దూరంగా ఉండాలని వారిచే ప్రతిజ్ఞ చేయించనున్నారు. ముఖ్యంగా విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లల యొక్క ప్రవర్తనను, వారి మిత్రుల కదలికలను,గమనించాలని వారికి సున్నితంగా హెచ్చరికలు చేసి సత్ప్రవర్తన కలిగేటట్లు తీర్చిదిద్దాలని చెప్పారు.

# యాదవ సహకార కార్పొరేషన్‌ను బలోపేతం చేద్దాం

## జక్కిడి శివచరణ్ రెడ్డి



**హయత్ నగర్, మే 12 (జనం సాక్షి)** తెలంగాణ రాష్ట్ర యాదవ సహకార కార్పొరేషన్ చైర్మన్, వైస్ చైర్మన్ గా నియమితులైన మారబోయిన రఘునాథ్ యాదవ్, గజ్జి భాస్కర్ యాదవ్ లను మన్సూరాబాద్ లోని తన నివాసంలో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేసిన యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి. ఈ సందర్భంగా జక్కిడి శివచరణ్ రెడ్డి మాట్లాడుతూ రఘునాథ్ యాదవ్, భాస్కర్ యాదవ్ ల నాయకత్వం లో యాదవ సహకార కార్పొరేషన్ మరింత బలోపేతం అవడంతో పాటు యాదవ సామాజిక వర్గం ఆర్థికంగా, అభివృద్ధి చెందే దిశగా విశేష కృషి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కర్మన్ ఘట్ హనుమాన్ దేవాలయ కమిటీ డైరెక్టర్ విష్ణు వర్ధన్ రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, జక్కిడి సత్యతేజ రెడ్డి, పోచనాబోయిన రఘు యాదవ్, వెంకట్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# మారుతున్న నియోజకవర్గ రూపురేఖలు.. రంగంలోకి ఎమ్మెల్యే

**మల్కాజిగిరి మే 12(జనంసాక్షి)** ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కాంట్రాక్టర్లకు, అధికారులకు సూచించారు. గౌతమ్ నగర్, మీర్జాల్గూడ ప్రాంతాలలో రూ. 1.25 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మాజీ కార్పొరేటర్ సునీత రాము యాదవ్, మాజీ ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్ తో కలిసి పనులను ప్రారంభించారు. చిన్మయి మార్గం, మీర్జాల్గూడలో రూ. 40 లక్షల వ్యయంతో డ్రైన్ రీమోడలింగ్ పనులు, రాజ శ్రీనివాస్ నగర్‌లోని మనీషా అపార్ట్‌మెంట్స్ సమీపంలో రూ. 22 లక్షల వ్యయంతో ఆర్‌సీసీ పైప్‌లైన్ నిర్మాణం, జ్యోతి నగర్ తీన్ కమాన్ సమీపంలో రూ. 35 లక్షల వ్యయంతో స్లాబ్ డ్రైన్ మరియు రోడ్డు ఎత్తు పెంపు పనులు, అన్నపూర్ణ కాలనీలో 28 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన వర్షపు నీటి పారుదల, డ్రైనేజ్ మరియు రహదారి సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. నిర్మాణ పనులు



నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈ లౌక్య, అసిస్టెంట్ ఇంజనీర్ దివ్య జ్యోతి, నాయకులు బద్దం పరుశురాం రెడ్డి, రావుల అంజయ్య, వీరేశం యాదవ్, జేపీసీ వెంకన్న, రాము యాదవ్, తోట నరేందర్ రెడ్డి, ఖలీల్, అరుణ్ రావు తదితరులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్య తీర్చిన చేవెళ్ల 'త్రిశూల్ టీమ్'



**చేవెళ్ల, మే 12 (జనంసాక్షి)** చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని మందుముల నగర్ కాలనీలో గత కొంతకాలంగా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న మిషన్ భగీరథ మాన్యువాల్ గుంత సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. అధికారుల నిర్లక్ష్యంపై విసిగిపోయిన స్థానిక 'చేవెళ్ల త్రిశూల్ టీమ్' సభ్యులైన కాసుల వివేక్ గౌడ్, రెడ్డిశెట్టి సాయిరాం, బండారి శరత్ పవన్ రెడ్డి, కాసుల అరుణ్ గౌడ్,బాస శివ కుమార్, ఇతర సభ్యులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ సమస్యను పరిష్కరించి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. ప్రమాదకరంగా మారిన మాన్యు వాల్ కాలనీలో రోడ్డు మధ్యలో ఉన్న మిషన్ భగీరథ మాన్యు వాల్ గుంత మూత లేకుండా ఓపెన్‌గా ఉండటంతో నిత్యం రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ముఖ్యంగా పాదచారులు రాత్రి సమయాల్లో గుంత కనిపించక అడుగు వేసే ప్రమాదం పొంచి ఉందనీ, వాహనదారులు ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు ఈ గుంతలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించక పోవడంతో రంగంలోకి దిగిన త్రిశూల్ టీమ్ ఈ ప్రమాదకర స్థితిపై కాలనీ వాసులు అధికారులకు అనేకమార్లు విన్నవించినప్పటికీ, వారి నుంచి ఎటువంటి స్పందన రాలేదు. దీంతో ప్రజల కష్టాలను చూసి చలించిన చేవెళ్ల త్రిశూల్ టీమ్, బాధ్యతగా రంగంలోకి దిగింది. ఓపెన్‌గా ఉన్న వాల్ గుంతపై పటిష్టమైన సిమెంట్ మూతను ఏర్పాటు చేశారు. గుంత చుట్టూ వాహనాలు సాఫీగా వెళ్లేలా సిమెంట్ పనులు చేయించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. అధికారులు చేయాల్సిన పనిని సామాజిక బాధ్యతగా భావించి పూర్తి చేసిన త్రిశూల్ టీమ్ సభ్యులను కాలనీ వాసులు, స్థానికులు అభినందనలతో ముంచెత్తుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇలాంటి ఇతర సమస్యలపై దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.

# 50 ఏళ్ల తర్వాత కలిసిన ఏయూ ఎంకాం పూర్వ విద్యార్థులు

## గోల్డెన్ జూబ్లీ రీయూనియన్‌లో ఆత్మీయ అనుబంధాల సందడి



**మల్కాజిగిరి మే 12(జనంసాక్షి)** ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎం.కాం 1975-77 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు దాదాపు ఐదు దశాబ్దాల అనంతరం ఒకేచోట చేరి గోల్డెన్ జూబ్లీ రీయూనియన్‌ను ఘనంగా నిర్వహించారు. జూబ్లీ హిల్స్‌లోని జూబ్లీహిల్స్ అంతర్జాతీయ క్లబ్లో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో 41 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమాన్ని బీవీ కృష్ణారెడ్డి అధ్యక్షుడిగా, పి. కాశీ విశ్వేశ్వరరావు ఉపాధ్యక్షుడిగా, ప్రొఫెసర్ ఎస్‌బీ నాగేశ్వరరావు ప్రధాన కార్యదర్శిగా, ఈ. చంద్రశేఖర్ రెడ్డి కార్యదర్శిగా, సీజేఎస్ నాయుడు సంయుక్త కార్యదర్శిగా, సి. రామప్రసాద్ ఖజాంచీగా, ప్రొఫెసర్ బి. అప్పా అప్పారావు సమన్వయకర్తగా, ఎం. రాజశేఖర్ రావు సావనీర్ సమన్వయకర్తగా వ్యవహరించారు.దాదాపు 50 ఏళ్ల తర్వాత సహ విద్యార్థులను కలుసుకోవడంతో కార్యక్రమం ఆత్మీయత నిండిన వేడుకగా మారింది. తమ విశ్వవిద్యాలయ దశలోని మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ అధ్యాపకులతో ఉన్న అనుబంధం, హాస్టల్ జీవితం, స్నేహితులతో గడిపిన అనుభవాలను పరస్పరం పంచుకున్నారు.తమకు విద్యాబోధన చేసి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకునేలా మార్గనిర్దేశం చేసిన అధ్యాపకులకు ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ బ్యాచ్‌కు చెందిన పలువురు పూర్వ విద్యార్థులు ప్రభుత్వ ఉన్నతాధికారులు, డీఐజీలు, అదనపు కార్యదర్శులు, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు, ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఆర్థిక సంస్థల్లో ఉన్నత పదవులు నిర్వహించగా, మరికొందరు విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్లు, ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులుగా సేవలందించి పదవీ విరమణ పొందినట్లు నిర్వాహకులు తెలిపారు.ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఈ గోల్డెన్ జూబ్లీ రీయూనియన్ నిర్వహించడం మరింత ప్రత్యేకతను సంతరించుకుందని వారు పేర్కొన్నారు.

# ఆరోగ్యకరమైన జీవనానికి యోగా మంత్రం

## కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి సురేష్ బాబు



**హయత్ నగర్, మే 12 (జనం సాక్షి)** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 2026 2వ రోజు కార్యక్రమం లో భాగంగా హయత్ నగర్ లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగ కార్యక్రమం, ఉన్నత విద్య లో ప్రవేశం పొందడానికి, పీజీ ప్రవేశ పరీక్షలపై కోచింగ్ అన్ని సబ్జెక్టులలో కళాశాల విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి సురేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ మన దైనందిన జీవితంలో యోగా, ధ్యానాన్ని భాగం చేసుకోవడం ద్వారా మనం ఆరోగ్యంగా మారడమే కాకుండా, ఆరోగ్యకరమైన జీవనశైలిని కొనసాగించవచ్చని అభిప్రాయపడ్డారు. కెరీర్ గైడెన్స్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ దుర్గ ప్రసాద్ మాట్లాడుతూ హ్యూమానిటీస్ ఆర్ట్స్, సోషల్ సైన్సెస్, లైఫ్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, ఎంఏ, ఎం కామ్, ఎం ఎస్ సి, ఎం ఎల్ ఐ ఎస్ సి కామన్ పీజీ ప్రవేశ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తిగల అభ్యర్థులకు ఆన్లైన్లో కోచింగ్ ఇస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ అనిత మాట్లాడుతూ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో యోగా, ధ్యాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. యోగా, ప్రాణాయామ రంగంలో ప్రస్తుతం అనేక పరిశోధనలు జరుగుతున్నాయని, మన జీవితాలను మరింత ఆరోగ్యవంతంగా మార్చుకోవడానికి ఈ ప్రాచీన విద్యను మనం సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక యోగా నిపుణుడు మల్లచారి హాజరై యోగ ప్రాముఖ్యతను సవివరంగా వివరించారు. యోగా, సాధన ద్వారా మనం అనేక వ్యాధులను నయం చేసుకొని, దీర్ఘకాలం ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆంజనేయ ఆదర్శాలను అనుసరించి సమాజ సేవ చెయ్యాలి

## మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



**హయత్ నగర్, మే 12 (జనం సాక్షి)** హనుమాన్ జన్మదినోత్సవం సందర్భంగా ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్ లోని శారదా నగర్ పంచముఖి హనుమాన్ దేవాలయంలో కాలనీవాసులు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో హయత్‌నగర్ తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ భక్తులతో కలిసి ఆంజనేయ స్వామి ని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి ఆశీస్సులు పొందుతూ కాలనీ ప్రజలందరి సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కోరుతూ, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ హనుమాన్ జన్మదినోత్సవం మన భారతీయ సంస్కృతి, సనాతన ధర్మం, భక్తి, సేవా తత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆంజనేయ స్వామివారి ఆదర్శాలను అనుసరించి ధర్మ పరిరక్షణ, సమాజ సేవ, దేశభక్తి మార్గంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కాలనీ ప్రజలందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆంజనేయ స్వామి ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి ఇంటిలో సుఖశాంతులు నెలకొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఉమ్మడి డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, కేంద్ర సెన్సర్ బోర్డు సభ్యులు అప్పారావు,ప్రధాన కార్యదర్శి గోవింద చారి, నాయకులు మధు సుధన్, ఎర్ర శ్రీకాంత్, కాలనీ అధ్యక్షులు ప్రదీప్, దేవాలయ కమిటీ అధ్యక్షులు భగవాన్, కాలనీవాసులు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని, భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కుషాయిగూడలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



**కాప్రా, మే 12 ( జనం సాక్షి) :** హనుమాన్ జయంతి సందర్భంగా కుషాయిగూడ బస్ స్టాప్ లో 54 అడుగుల భారీ హనుమాన్ విగ్రహం ఆలయం లో మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బొంతు శ్రీదేవి యాదవ్ మాట్లాడుతూ భగవాన్ హనుమంతుడు బలానికి, భక్తికి, సేవా తత్పరతకు, నిస్వార్థతకు ప్రతీక. శ్రీరామచంద్రుని పట్ల ఆయన చూపిన అచంచల భక్తి, లంకను దాటి సీతమ్మ జాడ కనుగొన్న ధైర్యం, సంజీవిని తీసుకొచ్చి లక్ష్మణుని ప్రాణం కాపాడిన కర్తవ్య దీక్ష మనందరికీ ఆదర్శం. ఈ పవిత్ర దినాన మనం తీసుకోవాల్సిన స్ఫూర్తి ఒక్కటే – కష్టాల ముందు వెరవకపోవడం, ధర్మం వైపు నిలబడటం, సమాజ సేవలో మన వంతు కర్తవ్యం నిర్వర్తించడం. హనుమంతుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలన్నారు.

# పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ స్నేహ మెహ్రా, ఆకస్మిక తనికి



**పెద్దేముల్ మే 12(జనంసాక్షి)** వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, మంగళవారం పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి, స్టేషన్ పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా ఎస్పీ, ముందుగా స్టేషన్ ఆవరణను, పరిసరాలను పరిశీలించి పరిశుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఎస్‌హెచ్‌ఓ, గది, రిసెప్షన్ సెంటర్, రైటర్స్ రూమ్, లాకప్ గదులతో పాటు మహిళా మరియు పురుషుల బ్యారక్‌లను, వాష్‌రూమ్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో రిసెప్షన్ అధికారులు ప్రవర్తించే తీరును అడిగి తెలుసుకున్న ఎస్పీ, పెండింగ్‌లో ఉన్న రికార్డులను, ఫైళ్లను స్వయంగా తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ రిసెప్షన్ అధికారులు, బ్లూ కోల్ట్స్ అధికారులకు , సెక్షన్ హెడ్ కానిస్టేబుళ్లు మరియు మహిళా సిబ్బందితో ముఖాముఖి మాట్లాడి వారి విధుల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇట్టి కార్యక్రమం ఎస్పీ మాట్లాడుతూ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, ముఖ్యంగా డైల్ 100 ద్వారా వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు భరోసా కల్పించాలని అన్నారు. అధికారులెవరూ పని ఒత్తిడికి గురికాకుండా ఎస్‌హెచ్‌ఓ సమన్వయం చేసుకోవాలని సూచించారు. పెద్దేముల్ ప్రాంతం కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో ఉన్నందున, అంతర్రాష్ట్ర సరిహద్దుల వద్ద ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ గారు హెచ్చరించారు. ముఖ్యంగా బక్రీద్ సందర్భంగా కర్ణాటక సరిహద్దుల నుండి అక్రమ పశువుల రవాణా మరియు ఇతర అక్రమ రవాణా లను అరికట్టేందుకు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలన్నారు. స్థానికంగా నమోదయ్యే నేరాల సరళిని విశ్లేషించి, ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా నేరాల నియంత్రణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పెండింగ్‌లో ఉన్న దొంగతనం కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితులను త్వరగా పట్టుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పెద్దేముల్ ఎస్సై ప్రశాంత్ వర్ధన్,హెడ్ కానిస్టేబుల్ రఫీ, మహిళా కానిస్టేబుల్ ముంతాజ్ కతుంన్ తో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కీ.శే. చిట్టి ప్రకాష్ రెడ్డి 5వ వర్ధంతి

- కుమారుడు శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో మాతా శిశు ఆసుపత్రిలో అల్పాహారం పంపిణీ



**తాండూర్, మే 8(జనం సాక్షి) :** దివంగత చిట్టి ప్రకాష్ రెడ్డి గారి 5వ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ మాతా శిశు ఆసుపత్రిలో రోగులకు, గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు అల్పాహారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు ఇడ్లీ, ఉప్మా, కేసరి, టీతో కూడిన పౌష్టికాహారాన్ని శ్రీకాంత్ రెడ్డి స్వయంగా వడ్డించారు. అనంతరం తండ్రి చిట్టి ప్రకాష్ రెడ్డి గారి చిత్రపటానికి పూలమాల వేసి, కొవ్వొత్తులు వెలిగించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, "మా నాన్నగారు బతికి ఉన్న రోజుల్లో ఎప్పుడూ 'ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టు, కష్టంలో ఉన్నవారికి అండగా ఉండు' అని చెప్పేవారు. ఆయన ఆశయ సాధనలో భాగంగానే ప్రతి ఏటా వర్ధంతి రోజున సేవా కార్యక్రమం చేస్తున్నాం. ముఖ్యంగా అమ్మలు, చిన్నారులు ఉండే ఈ ఆసుపత్రిలో సేవ చేయడం మాకు ఎంతో తృప్తినిస్తుంది" అని అన్నారు. ఆసుపత్రి సిబ్బంది మాట్లాడుతూ, "చిట్టి ప్రకాష్ రెడ్డి గారు సమాజ సేవకు అంకితమైన వ్యక్తి. ఆయన తనయుడు శ్రీకాంత్ రెడ్డి కూడా తండ్రి బాటలోనే నడుస్తూ సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయం" అని కొనియాడారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, మిత్రులు, యువజన సంఘం నాయకులు, ఆసుపత్రి సిబ్బంది, వైద్యులు పాల్గొన్నారు.

# విజయవాడలో అమూల్ ప్లాంట్ ప్రారంభం

## రూ.50 కోట్ల వ్యయంతో భారీ ప్రాజెక్ట్ రైతులకు మేలు, యువతకు ఉపాధి అవకాశాలు



అబ్దుల్లాపూర్ మెట్, మే 11(జనం సాక్షి ): ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ అమూల్‌కు చెందిన నూతన డెయిరీ ప్లాంట్ నిర్మాణ కార్యక్రమం విజయవాడ సమీపంలోని నెక్కలం గొల్లగూడెం గ్రామంలో మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. తెలంగాణకు చెందిన ప్రముఖ పారిశ్రామిక సంస్థ ఎస్.పీ. రెడ్డి డైరీ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ భారీ ప్రాజెక్టును సుమారు రూ.50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి దేశ డెయిరీ రంగానికి చెందిన పలువురు ప్రముఖులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ముఖ్య అతిథులుగా అమూల్ మేనేజింగ్ డైరెక్టర్ జయేన్ మెహతా, సబర్ యూనియన్ మేనేజింగ్ డైరెక్టర్ సుభాష్ చంద్ర పటేల్, మార్కెటింగ్ నేషనల్ హెడ్ రాజన్, సౌత్ మార్కెట్ హెడ్ షణ్ముగాన్, విజయవాడ మార్కెట్ హెడ్ వాగ్య పాల్గొని ప్లాంట్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన అతిథులు, ఈ డెయిరీ ప్లాంట్ ద్వారా ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల్లో పాల ఉత్పత్తుల రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. రైతులకు న్యాయమైన ధరలు అందడంతో పాటు, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించబడుతున్న ఈ పరిశ్రమ ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. సంస్థ డైరెక్టర్ సామ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, "రైతుల అభివృద్ధి మరియు నాణ్యమైన పాల ఉత్పత్తుల తయారీ లక్ష్యంగా ఈ ప్లాంట్‌ను అత్యాధునిక సదుపాయాలతో నిర్మిస్తున్నాం. ఈ ప్రాజెక్ట్ ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి కీలకంగా మారుతుంది" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డెయిరీ రంగ ప్రతినిధులు, వ్యాపారవేత్తలు, రైతు సంఘాల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించడంతో కార్యక్రమ ప్రాంగణం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్లాంట్ పూర్తయిన అనంతరం రోజుకు లక్ష లీటర్ల పాల ప్రాసెసింగ్ సామర్థ్యంతో పాలు మరియు పాల ఉత్పత్తుల తయారీ కార్యకలాపాలు ప్రారంభించనున్నట్లు సంస్థ ప్రతినిధులు వెల్లడించారు.

# నేడు మండలంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ పర్యటన

## కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు జగదీశ్వర్



**మర్పల్లి మే 12 (జనంసాక్షి)** నేడు తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మండలంలో విశుతంగా పర్యటిస్తున్నారని మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు కోటి గారి జగదీశ్వర్ (లడ్డు) మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని మొగిలిగుండ్ల, కోట మర్పల్లి గ్రామంలో శ్రీ మల్లన్న స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను స్పీకర్ చేతుల మీదుగా ప్రారంభోత్సవము. ఇటీవల అనారోగ్యంతో మరణించిన చంద్రయ్య స్వామి కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు

# నంది వనపర్తిలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



**యాచారం, మే 12(జనం సాక్షి )** యాచారం మండల పరిధిలోని నందున ప్రతి గ్రామంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు యువకులు గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. జ్ఞాన సరస్వతి ఫౌండర్ సదా వెంకటరెడ్డి సంకల్ప భవనంపై ధ్వజారోహణం ఆవిష్కరించి భక్తాంజనేయుడికి అభిషేకం నిర్వహించారు. నంది వనపర్తి అనుబంధ గ్రామాలు గిరిజన తండాల్లోని ఆంజనేయుడు గుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవమాన హోమం పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. తమలపాకులతో ఆకు పూజ సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం,అఖండ హారతి, కార్యక్రమం నిర్వహించారు. హనుమాన్ శోభాయాత్ర గ్రామంలో కన్నుల పండుగ జరిగింది. గ్రామస్తులుప్పుల మతాలకు అతీతంగా పెద్ద ఎత్తున ఉత్సవాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాయికంటి విజయ్ కుమార్,ఉపసర్పంచ్ శ్రీశైలం, జ్ఞాన సరస్వతి సేవా సమితి సభ్యులు రాఘవేంద్ర శర్మ, రామనాథం, సంగెం గణేష్, చిన్న జలంధర్ రెడ్డి, నిఖిల్, శ్రీనివాస్ రెడ్డి, గ్రామ యువకులు కొండాపురం నాగరాజు, నూకం మహేందర్, లక్ష్మణ్ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఐజి కాలనీ సమస్యలు పరిష్కరించాలి

## మంత్రికి, జిల్లా కలెక్టర్ వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



కాప్రా, మే12 (జనం సాక్షి) : చర్లపల్లి డివిజన్లోని ఐజీ కాలనీ సమస్యల పరిష్కారానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి , వాటర్ వర్క్స్ ఎండీ అశోక్ రెడ్డి మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ 2009 సంవత్సరంలో జేఎన్న్యూఆర్ఎం పథకం కింద సుమారు 1200 ఇళ్లను నిర్మించగా, అప్పట్లో ఏర్పాటు చేసిన డ్రైనేజీ వ్యవస్థ ప్రస్తుతం పూర్తిగా దెబ్బతిన్నదని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. దీంతో డ్రైనేజీ నీరు రోడ్లపైకి పొంగిపొర్లుతూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నదని తెలిపారు. అలాగే, 2009లో నిర్మించిన ఇళ్లలో చాలావాటిలో స్లాబ్‌లు శిథిలావస్థకు చేరుకుని కూలిపోయే ప్రమాదం నెలకొన్నదని, వాటి మరమ్మతుల కోసం కాలనీ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారని వారి దృష్టికి తీసుకెళ్లారు. ఐజీ కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, పరిస్థితిని వెంటనే పరిశీలించి డ్రైనేజీ వ్యవస్థ పునరుద్ధరణతో పాటు ఇళ్ల మరమ్మతులకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని, సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు నెమూరి మహేష్ గౌడ్, కాలనీ అధ్యక్షుడు పర్శురాము యాదవ్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, సాగర్ గౌడ్ , వెంకటేష్, ప్రహ్లాద్ రెడ్డి, రవి యాదవ్, వెంకటేశ్వర్ రావు , లోక్ నాథ్ ,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు గుడ్ న్యూస్! సొంత భవనంలోకి ప్రభుత్వ డిగ్రీ కళాశాల

## ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా ప్రగతి పనులు




ఇబ్రహీంపట్నం,మే 12(జనం సాక్షి ) వేలాది విద్యార్థుల అక్షర కోవెల. భవిష్యత్తుకు బంగారుబాటలు వేసే నూతన విద్యాసౌధం ఎట్టకేలకు ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. దశాబ్దాలుగా నిర్లక్ష్యపు నీడలో నిలబడి నేతల అసమర్థత నిదర్శనంగా నిలిచిన ఇబ్రహీంపట్నం డిగ్రీ కళాశాల భవనం అత్యాధునిక హంగులతో రూపుదిద్దుకుంది. అద్దె భవనాలు, అరకొర వసతులు, షిఫ్ట్ పద్ధతి తరగతులతో ఏళ్ల పాటు సాగిన ఈ కళాశాల ప్రస్థానం ఇక సరికొత్త మైలురాయిని చేరుకుంది. ఆచార్య వినోభాబావే నడయాడిన చోట సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్న నూతన ఉన్నత విద్యాకేంద్రం ప్రారంభోత్సవం నేడు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా ఘనంగా జరగనుంది. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలో 2008లో కాంగ్రెస్ హయాంలో డిగ్రీ కళాశాలను మంజూరు చేయటం జరిగింది. నాటి నుంచి బీఆర్ఎస్ రెండు దఫాలుగా ప్రభుత్వం ఏర్పాటు చేసినా భవనం మంజూరుకు పదేళ్ల పట్టింది. గత 18ఏళ్ళ _గా సరైన భవనం లేక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం పూట డిగ్రీ కళాశాల విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తూ వస్తున్నారు. ఎండలో వేచి చూడటం, సాయంత్రం వేళల్లో రవాణా సౌకర్యం లేక గ్రామీణ ప్రాంత విద్యార్థినులు పడ్డ ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. 2017లో వినోభానగర్ లో నూతన భవన నిర్మాణానికి రూ.3.25కోట్లతో ప్రారంభోత్సవం చేసి, పదేళ్లుగా పనులు చేస్తూ వచ్చారు. అలా వదిలేసిన డిగ్రీ కళాశాల భవనానికి ఇక శాశ్వత పరిష్కారం లభించింది. విద్యతోనే వికాసం సాధ్యమని నమ్మే మన ప్రియతమ శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి ఇబ్రహీంపట్నంలో షిఫ్ట్ ల వారీగా సాగుతున్న జూనియర్, డిగ్రీ తరగతులు, గ్రామీణ విద్యార్థుల కష్టాలు చూసి చలించిపోయారు. ఇందులో భాగంగానే ఉన్నతాధికారులతో మాట్లాడి, పెండింగ్ లో ఉన్న నిధులను మంజూరు చేయించారు. అనంతరం, అన్నీతానే.... గుత్తేదారులను, అధికారులను పరుగులు పెట్టించి, నూతన భవన నిర్మాణం ఎట్టకేలకు పూర్తి చేయించారు. ఐదెకరాలలో రూపుదిద్దుకున్న చుట్టూ ప్రశాంతమైన వాతావరణం, విశాలమైన గదులు, డిజిటల్ ల్యాబ్స్ మరియు క్రీడా ప్రాంగణంతో ప్రైవేటు సంస్థలకు దీటుగా రూపుదిద్దుకుంది. 12 తరగతి గదులు, 3 ల్యాబ్స్, ఎన్ సీసీ రూం, అధ్యాపకులకు హాల్, స్పోర్ట్స్ రూం, విద్యార్థినీవిద్యార్థులకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు, విశాలమైన క్రీడాప్రాంగణం, ఆకట్టుకునే గ్రీన్ ప్లాంటేషన్ తో అద్భుతంగా తీర్చిదిద్దారు. కళాశాలకు కేటాయించిన స్థలం ఆక్రమణలకు గురికాకుండా ఎమ్మెల్ మల్ రెడ్డి రంగారెడ్డి ప్రత్యేకంగా ఫెన్సింగ్ ఏర్పాటు చేయించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించింది. ధనిక, పేద అనే తారతమ్యం లేకుండా తెలంగాణ భవితకు బంగారుబాటలు వేసేందుకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యనందించేందుకు కృషిచేస్తున్నాం. ఇందులో భాగంగానే ఇన్నాళ్లు పాలకుల నిర్లక్ష్యానికి గురైన ఇబ్రహీంపట్నం డిగ్రీ కళాశాల భవనం పూర్తిచేశాం. కళాశాలలో అత్యున్నత విద్యనందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తాం. కార్పొరేట్ విద్య అంటూ లక్షల రూపాయలు వృథా చేసుకోకుండా ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విద్యను ఉపయోగించుకోవాలని అన్నారు.

# ఏళ్లు గడుస్తున్నా అందని కొలువులు

## ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి



హయత్ నగర్, మే 12 ( జనం సాక్షి) ఉద్యోగ నోటిఫికేషన్లు వెంటనే విడుదల చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, నిరుద్యోగుల ఆత్మహత్యలను అరికట్టేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ నిరుద్యోగ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతతో కలిసి దిల్ సుఖ్ నగర్ వరకు వారితో కలిసి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవీ రెడ్డి సుధీర్ రెడ్డి పాదయాత్ర లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవి రెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఖాళీ పోస్టులను భర్తీ చేసి ఉద్యోగ నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన కోరారు. మొదటి ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, అయితే ఇప్పటివరకు ఆ హామీలు అమలు కాలేదని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించినప్పటికీ దానిపై స్పష్టత లేకపోవడం నిరుద్యోగులను నిరాశకు గురిచేస్తోందన్నారు. జీవో 29, జీవో 46 లను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రూప్-1 నియామకాల్లో చోటుచేసుకున్న అనుమానాలపై సిట్ ఎంక్వయిరీ నిర్వహించి పారదర్శకంగా విచారణ చేపట్టి, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో సీనియర్ భారస నాయకులు బిచేనేపల్లి వెంకటేశ్వరరావు, గడ్డిఆన్నారం మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు శ్రీశైలం యాదవ్, రమణారెడ్డి, శైలజ, గండి సన్నీ యాదవ్, ప్రతీక్, శివరాం, విక్కీ, సమ్ము రాము, ప్రదీప్, రవీందర్ రెడ్డి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మాసిటీ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

## ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం



యాచారం,మే 12(జనం సాక్షి ) ఫార్మాసిటీ రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఫార్మాసిటీ భూబాధిత గ్రామాలకు చెందిన రైతులు కోదండ రామ్ ని కలిసి వారి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మాసిటీకి భూములు ఇవ్వని రైతుల పేర్లను ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు బలవంతపు భూసేకరణ తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు కోర్టు కేసులు ఉన్న భూముల జోలికి అధికారులు వెళ్లడం మానివేయాలని డిమాండ్ చేశారు. కోర్టు ధిక్కరణ చేసే సహించేది లేదని తెలిపారు ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ పేరుతో 30 వేల ఎకరాల భూములను సేకరించడం మానుకోవాలి అన్నారు. ప్రభుత్వంతో మాట్లాడి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సామా నిరంజన్, ఫార్మా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడిగా ఊటు యశ్వంత్ ఎన్నిక

**ఇబ్రహీంపట్నం, మే 12 (జనం సాక్షి ) :** తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ సంఘం (టీఎన్జీవో) రంగారెడ్డి జిల్లా కమిటీ ఎన్నికలు నాంపల్లిలోని రాష్ట్ర టీఎన్జీవో కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర టీఎన్జీవో అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి హుస్సేన్ ఆదేశాల మేరకు జరిగిన ఈ ఎన్నికల ప్రక్రియకు రాష్ట్ర టీఎన్జీవో కేంద్ర సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్ ముత్యాల సత్యనారాయణ గౌడ్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో రంగారెడ్డి జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడిగా ఊటు యశ్వంత్ (రెవెన్యూ శాఖ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా మాధవ్ గౌడ్ (హెచ్‌డబ్ల్యూఓ), వైస్ ప్రెసిడెంట్లుగా రంగయ్య (అగ్రికల్చర్), అంజాత్ అలీ (వైద్య శాఖ), రాజశేఖర్ (రెవెన్యూ), వాణి (ప్రణాళిక శాఖ) ఎన్నికయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్ రావు (మెడికల్ శాఖ)



బాధ్యతలు స్వీకరించగా, జాయింట్ సెక్రటరీలుగా శ్రీనివాస్, గాయత్రి, కార్తీక్, అమృత ఎన్నికయ్యారు. ట్రెజరర్‌గా ఆనంద్ సింగ్ (రెవెన్యూ శాఖ), ఆర్గనైజింగ్ సెక్రటరీగా గంగాధర్, పబ్లిక్ సెక్రటరీగా శివ కుమార్ బాధ్యతలు చేపట్టారు. అలాగే ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా మల్లేష్ గౌడ్, నసీరుద్దీన్, వెంకటరెడ్డి, విజిత, శేఖర్‌లను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఊటు యశ్వంత్ మాట్లాడుతూ... ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, టీఎన్జీవో సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు అందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని తెలిపారు. సంఘంపై విశ్వాసం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న కమిటీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఉద్యోగులంతా ఐక్యంగా ఉండి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. నాపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా చిత్తశుద్ధితో నిస్వార్థంగా పనిచేస్తానని చెప్పారు. రాష్ట్ర నాయకత్వం కూడా నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఉద్యోగుల హక్కుల పరిరక్షణలో సమిష్టిగా పని చేయాలని సూచించింది. కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొని నూతన కమిటీని అభినందించారు.

# నీట్ పరీక్ష నిర్వహణలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలం

- కేంద్రప్రభుత్వ నిర్లక్ష్యం విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడుతోంది.
- దేశ భవిష్యత్తును నిర్మించే యువత జీవితాలతో రాజకీయాలు చేయడం తగదు.
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూర్, మే 12 (జనంసాక్షి)** దేశవ్యాప్తంగా వైద్య విద్య కోసం సిద్ధమవుతున్న లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే నీట్ పరీక్ష నిర్వహణలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు .మంగళవారం ఓ ప్రకటణలో తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరుసగా ప్రశ్నపత్రాల లీకేజీలతో, పారదర్శకత లోపించడం వల్ల విద్యార్థులు మరియు తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొందని పేర్కొన్నారు. పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఎన్నో సంవత్సరాలు కష్టపడి పరీక్షలకు సిద్ధమవుతుంటే, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వారి భవిష్యత్తు అనిశ్చితిలో పడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశ భవిష్యత్తును నిర్మించే యువత జీవితాలతో రాజకీయాలు చేయకుండా, కేంద్ర ప్రభుత్వం వెంటనే పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల నమ్మకాన్ని కాపాడాలంటే నీట్ పరీక్ష వ్యవస్థలో పూర్తి పారదర్శకత, భద్రత, జవాబుదారీతనం తీసుకురావడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.అలాగే సాధ్యమైనంత త్వరగా మళ్లీ నీట్ పరీక్షను అత్యంత పకడ్బందీగా నిర్వహించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలన్నారు.నీట్ పేపర్ లీకేజీకి పూర్తి బాధ్యత వహించి కేంద్ర ప్రభుత్వం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు క్షమాపణలు చెప్పాలని అన్నారు.

# అంగరంగ వైభవంగా హరిహరుల కళ్యాణోత్సవ వేడుకలు

## అన్నదానం నిర్వహించిన నక్క ప్రభాకర్ గౌడ్



**శామీర్ పేట్, మే 12(జనం సాక్షి )** మూడుచింతలపల్లి మండలం ఉద్దెమర్రిలోని అతిపురాతణమైన అక్కన్న మాదన్నలు నిర్మించిన అలయంలో శ్రీవిష్ణు శివాలయంలో 40వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో బాగంగా ఆలయ కమిటి నిర్వాహకులు శ్రీదేవి భూదేవి నమేత లక్ష్మి వేంకటేశ్వరస్వామి, శ్రీ భవాణి రామలింగేశ్వర స్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వ హించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం సుప్రభాత సేవతో మొదులుకొని వాయిద్య గోష్టి, నిత్యార్పణ, వీరాంజనేయ స్వామికి సిందూర అభిషేకం, ఎదుర్కొళ్లు వంటి కార్యక్రమాలు నిర్వ హించారు. సాయంత్రం దివ్య రథోత్సవంతో ఊరేగింపు కార్యక్రమాలను ఘనంగా జరిపించారు. స్వామివార్ల కల్యాణోత్సవాలను వేదపండితులు వేద మంత్రోచ్చరణల మధ్య ఆటపాటలతో భక్తి భావంతో కళ్యాణ తంతును ఘనంగా నిర్వ హించారు. కళ్యాణ మహోత్సవంలో పుణ్య దంపతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్ ఏర్పాటు చేసిన అన్నదానంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఊరేగింపు లో చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టు కున్నాయి. శ్రీరామ భజన బృందం, అయ్యప్ప సేవా సమితి అలరించిన భజన పాటలతో ఆలయం భక్తి మార్గంలో మార్మోగింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆడెపు ఉమా మహేశ్వరీ,మున్సిపాలిటీ చైర్మన్ జాం రవి, నక్క ప్రభాకర్ గౌడ్,మధుకర్ రెడ్డి, దోసకాయల వెంకటేష్, విష్ణు గౌడ్,చామకూర మహేందర్ రెడ్డి, కౌన్సిలర్లు లతా వెంకటేష్, లతా వెంకట్ రెడ్డి, లత భూపాల్,ధర్మకర్తలు బూడిద రవీందర్ గౌడ్, సామల రాజీరెడ్డి, ఆకుల నాగేష్, నాయకులు మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, వైద్యనాథ్,భూమేష్, శ్రీనివాస్ గౌడ్,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# తంగడపల్లిలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



చేవెళ్ల, మే 12 (జనంసాక్షి) తంగడపల్లి గ్రామంలోని దశావతార సహిత వెంకటేశ్వర స్వామి ఆలయం ప్రాంగణం లోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం హనుమాన్ జయంతి సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు నడదూర్ వెంకటాచార్యులు మాట్లాడుతూ.. వెంకటేశ్వర స్వామి ప్రాంగణంలోని ఈరోజు ప్రత్యేకమైన పూజలు నిర్వహించి భక్తులకు కూడా మంచి మార్గాన్ని ఎంచుకొని ముందు వాడికి వేస్తే హనుమంతుని పేరు తలుచుకుంటే రోమాలు కదిలి రామా నామాన్ని చెప్పగలుగుతాము అని తెలిపారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో చేశారు. ఈ కార్యక్రమంలోని గ్రామ సర్పంచ్ పామెన రాములు అర్చకులు శేషాద్రి, వేణు మాధవన్ తదితరులు గ్రామస్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బండి భగీరథ్ అరెస్టుకు డిమాండ్

## మంత్రి నివాసంలో చట్టం ఉల్లంఘనపై ప్రజాసంఘాల ఆగ్రహం!

### ఐద్వా అఖిల భారత ఉపాధ్యక్షురాలు ఎస్. పుణ్యవతి




ముషీరాబాద్, మే 12 (జనం సాక్షి): దేశంలో చట్టాన్ని కాపాడాల్సిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి ఇంట్లోనే చట్టాన్ని ఉల్లంఘించే పరిస్థితి నెలకొనడం సమాజానికి ప్రమాదకర సంకేతమని తెలంగాణ రాష్ట్ర ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఐద్వా కమిటీలు స్పష్టం చేశాయి. మైనర్ బాలికపై లైంగిక దాడి చేసిన నిందితుడు బండి సాయి భగీరథ్ ను తక్షణమే అరెస్టు చేసి రిమాండ్ చేయాలని డిమాండ్ చేశాయి. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్ వద్ద భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ), అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) తెలంగాణ రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు అధ్యక్షతన బండి సంజయ్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమానికి ఐద్వా అఖిల భారత ఉపాధ్యక్షురాలు ఎస్. పుణ్యవతిక, ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్. అరుణ జ్యోతి, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ లు పాల్గొని మాట్లాడారు. అధికార అహంకారంతో తన కుమారుడు చేసిన నేరాన్ని కప్పిపుచ్చుకునేందుకు బండి సంజయ్ ప్రయత్నిస్తున్నారని, ఇది మహిళల భద్రతను తాకట్టు పెట్టడమేనన్నారు. పోక్సో వంటి తీవ్రమైన కేసు నమోదైనా బీజేపీ నాయకత్వం స్పందించకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. బాధిత బాలిక కుటుంబం ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు, ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమని మండిపడ్డారు. పోక్సో కేసు నమోదై నాలుగు రోజులు గడిచినా నిందితుడిని అరెస్టు చేయకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని విమర్శించారు. బండి సంజయ్ పాత్రపై సమగ్ర విచారణ జరిపి ఆయనను కేంద్ర మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడి, అనంతరం బెదిరింపులకు దిగడమే కాకుండా కేసును సెటిల్ చేసుకునే ప్రయత్నాలు జరగడం అత్యంత దారుణమని తీవ్రంగా ఖండించారు. "దేశంలో 'బేటీ బచావో, బేటీ పడావో' అనే నినాదాలు ఇచ్చే బీజేపీ నాయకత్వం, మహిళలపై జరుగుతున్న అత్యాచారాల విషయంలో మాత్రం నేరస్తులను కాపాడే సంస్కృతిని ప్రోత్సహిస్తోందని విమర్శించారు. బిల్కిస్ బాను కేసు నుంచి దేశవ్యాప్తంగా మహిళలు, చిన్నారులపై జరుగుతున్న దాడుల వరకు బీజేపీ పాలిత వ్యవస్థల వైఖరి మహిళా వ్యతిరేకంగా మారిందని ఆమె ఆరోపించారు. కేంద్ర మంత్రి పదవిలో ఉన్న బండి సంజయ్ తన కుమారుడిపై వచ్చిన తీవ్రమైన ఆరోపణలను సమర్థిస్తూ వెనుకేసుకురావడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. మైనర్ బాలికపై లైంగిక దాడి జరిగినా ప్రభుత్వం, పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోకుండా బండి సంజయ్ కుటుంబానికి కొమ్ముకాస్తున్నట్లు కనిపిస్తోందన్నారు. ప్రభుత్వ పదవిలో కొనసాగడానికి నైతిక హక్కు కోల్పోయిన బండి సంజయ్ తక్షణమే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బండి భగీరథ్ గతంలో మహేంద్ర యూనివర్సిటీలో ర్యాగింగ్, డ్రగ్స్ వినియోగం వంటి ఆరోపణల్లో కూడా సోషల్ మీడియాలో వార్తల్లో నిలిచిన విషయాన్ని గుర్తుచేస్తూ, అధికార అండతో ఇష్టారాజ్యంగావ్యవహరిస్తున్నారని విమర్శించారు. బాధిత కుటుంబానికి బండి సంజయ్ అనుచరుల నుంచి బెదిరింపులు వస్తున్న నేపథ్యంలో వెంటనే భద్రత కల్పించాలని, కేసుపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి బండి భగీరథ్‌ను అరెస్టు చేసి రిమాండ్ చేయాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో డీజీపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. జ్యోతి, ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.ఎన్ అశాలత, కవిత, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, ఎన్ పి ఆర్ డి రాష్ట్ర కార్యదర్శి అడివయ్య, టి పి టి ఎల్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు విజయ్ కుమార్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోక్ రెడ్డి రాష్ట్ర కమిటి సభ్యులు లెనిన్, రమేష్, డివైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు కిరణ్ రాజయ్య, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# బ్యూటీ పార్లర్‌కు వెళ్లిన మహిళ మిస్సింగ్

### అనుమానంతో భర్త పోలీసులకు ఫిర్యాదు




జిల్లేడు చౌదరి గూడ (జనం సాక్షి) షాద్నగర్ లో ఉంటున్న బంజారా బ్యూటీ పార్లర్ లో వర్క్ నేర్చుకోవడానికి వెళ్తున్న మౌనిక (22) కనిపించకుండా పోయింది అనుమానంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు జిల్లేడు చౌదరిగుడా ఎస్ఐ విజయ్ తెలిపిన వివరణ మేరకు భర్త చింటుతో మౌనిక షాద్నగర్ లో ఉంటున్న బంజారా బ్యూటీ పార్లర్ కు వెళ్లి వస్తా అని చెప్పి పోయింది తన భర్త ఎక్కడా చూసిన కనిపియ్యకపోవడంతో ఒక వ్యక్తిపై అనుమానంతో పోలీస్ స్టేషన్కు వచ్చి ఫిర్యాదు చేశారు ఆమె పింకు రంగు టాప్, రెడ్ కలర్ పాయింట్, పింక్ కలర్ చున్ని ధరించి ఇంట్లో నుంచి వెళ్లినట్లు పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునమని పేర్కొన్నారు.

# నేడు కాడ కార్యాలయంలో సర్పంచులకు అవగాహన కార్యక్రమం

### మండల విద్యాధికారి హరిలాల్

### మండల పరిషత్ అభివృద్ధి అధికారి వెంకన్ గౌడ్





బొంరాస్ పేట, మే 12 ( జనం సాక్షి): మండల పరిధిలోని అన్ని గ్రామాల సర్పంచులకు నేడు కొడంగల్ పట్టణంలోని కాడ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విద్యా వారోత్సవాల్లో భాగంగా సర్పంచులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి వెంకన్ గౌడ్,మండల విద్యాధికారి హరిలాల్ వేరువేరు ప్రకటనలో తెలిపారు. విద్యా వ్యవస్థ బలోపేతంపై చర్చించే సమావేశానికి ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

# నీటి సంపులో పడి అనుమానాస్పద స్థితిలో బాలిక మృతి

శేరిలింగంపల్లి, మే 12 (జనంసాక్షి) : అనుమానాస్పద స్థితిలో ఓ 13 ఏళ్ల బాలిక నీటి సంపులో పడి మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మియాపూర్ సిఐ వెల్లడించిన వివరాల ప్రకారం... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం మద్దిరాల తండాకు చెందిన చరణ్, రేణుక దంపతులు బ్రతుకుతెరువు నిమిత్తం గత పది సంవత్సరాల క్రితం నగరానికి వచ్చి శేరిలింగంపల్లి నియోజకవర్గం గోకుల్ ఫ్లాట్స్ లో వాచ్మెన్ గా జీవనం కొనసాగిస్తున్నారు. కాగా గత ఎనిమిది రోజుల క్రితమే పాత అపార్ట్మెంట్లో పని మానేసి నూతనంగా శ్రీ రెసిడెన్సి అపార్ట్మెంట్ లో వాచ్మెన్ గా చేరడం జరిగింది. అయితే సోమవారం రాత్రి 7:30 గంటల సమయంలో అపార్ట్మెంట్ లోని భారీ



నీటి సంపు మూత తెరిచి ఉండడం అందులో నిండా నీరు ఉండడంతోపాటు చరణ్ కూతురు సారా సమయానికి కనిపించకపోవడంతో అపార్ట్మెంట్ అంతా వెతికి చివరకు అనుమానంతో వాటర్ సంపులోకి చూడగా అందులో ఆమె మునిగి ఉండడంతో నిజాంపేట్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అనంతరం మియాపూర్ పోలీసులకు ఆసుపత్రి వర్గాలు సమాచారం అందించగా వారు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా సారా డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీ అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా విద్యాభ్యాసం కొనసాగిస్తుందని, అమ్మాయి జీవితం ఇలా అర్ధాంతరంగా ముగిసిపోవడం తీవ్ర ఆవేదనను కలిగించిందని సంస్థ ప్రధాన కార్యదర్శి చావ అరుణ వాపోయారు. దర్యాప్తును నిజాయితీగా కొనసాగించి బాలిక మృతి కేసులో నిజాలను నిగ్గు తేల్చాలని ఆమె పోలీసులను కోరారు.

# 19వ శతాబ్దపు చారిత్రక వారసత్వం



మర్పల్లి మే 12 (జనంసాక్షి) వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల పరిధిలోని కోట మర్పల్లి గ్రామంలో 19వ శతాబ్దానికి చెందిన పురాతన మల్లన్న స్వామి దేవాలయ పునర్నిర్మాణ పనులను (బుధవారం) నేడు తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చేతులమీదుగా భూమి పూజ కార్యక్రమాన్ని చేపడుతున్నామని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం కోట మర్పల్లి శివారులో ఉన్న మల్లన్న గుట్ట ప్రాంగణంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో కుల మతాలకు అతీతంగా గ్రామదేవతలకు పూజిస్తూ వస్తున్నారని, కొమురవెల్లి మల్లన్న స్వామి, మైలారం మల్లన్న స్వామి దేవాలయాలతో పాటు గ్రామంలో మల్లన్న స్వామి దేవాలయ పునర్నిర్మాణ పనులను గ్రామస్తుల సహకారంతో ఈ పునర్నిర్మాణ పనులను ప్రారంభిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్ రెడ్డి, మాజీ సర్పంచ్ విజయలక్ష్మి రచ్చన్న, శ్రీనివాస్ రెడ్డి అనంత్ రెడ్డి జహింద్ రెడ్డి లక్ష్మీకాంత్ రెడ్డి ప్రభు రఘుపతి రెడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# తాండూర్ వినాయక హాస్పిటల్‌లో ఘనంగా నర్స్ డే వేడుకలు

తాండూరు మే 12 (జనంసాక్షి) తాండూర్ పట్టణంలోని వినాయక ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం నర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వర్మ విఠల్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై సిబ్బందిని, నర్సులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "మదర్ థెరిసా లాగా సిస్టర్స్ కూడా హాస్పిటల్‌లో నిస్వార్థంగా సేవలు అందిస్తున్నారు. వారి సేవలను ఈ రోజు గుర్తు చేసుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ ఎండీ వర్మ ప్రశాంతి ,13వ వార్డు కౌన్సిలర్ సురేష్ నాయక్, హాస్పిటల్ మేనేజర్ విశాల్,



హాస్పిటల్ సిబ్బంది, నర్సులు నర్సుల సేవలను కొనియాడుతూ కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు.

# నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై సమగ్రంగా విచారణ చేపట్టాలి

### కాంగ్రెస్ పార్టీ యాచారం మండలం నాయకులు ముచ్చర్ల శ్యామ్



యాచారం,మే 12 (జనం సాక్షి) ఈ ఏడాది నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం బాధ్యత లేకుండా వ్యవహరించడం బాధాకరమని మండల కాంగ్రెస్ నాయకులు ముచ్చర్ల శ్యామ్ అన్నారు. నీట్ పరీక్షను నిర్వహించే ఎన్ టీ ఏ కేంద్ర ప్రభుత్వ పరిధిలో పనిచేస్తోందని ఈ ఘటనపై పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని అన్నారు. విద్యార్థుల కష్టం, తల్లిదండ్రుల ఆశలు, వారి భవిష్యత్తుతో నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఖండిస్తున్నామని, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలన్నారు.

# మైనర్లకు మద్యం అమ్మితే కఠిన చర్యలు

- లైసెన్స్ రద్దు చేస్తాం.. జనంసాక్షి వార్తకు తక్షణ స్పందన
- సంతోష్ మాత వైన్స్ షాపుపై ఆకస్మిక తనిఖీ
- సీసీటీవీ ఫుటేజ్ స్వాధీనం


మైనర్లకు మద్యం అమ్మకాలు..
- పట్టించుకోని ఎక్సైజ్ శాఖ అధికారులు
- తలకొండపల్లి సంతోషిమాత వైన్స్‌కు నిబంధనలు జాంతానై

తలకొండపల్లి మే11(జనంసాక్షి): మండల కేంద్రంలోని సంతోషి మాత వైన్స్ షాపులో నిబంధనలకు విరుద్ధంగా మైనర్లకు మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.అలాగే మండలంలోని ప్రతి గ్రామంలో బెల్ట్ షాపులకు భారీగా మద్యాన్ని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.ప్రతి ఊరిలో బెల్టు దుకాణాలను తెరిచి అధిక ధరలకు మద్యం అమ్మకాలు చేస్తున్నారు. ఆటోల ద్వారా కూరగాయలు విక్రయించినట్లుగా మద్యం సీసాలను బెల్టు షాపులకు సరఫరా చేస్తున్నారు.ప్రతి ఊరిలో రెండు నుంచి 15 వరకు బెల్టు షాపులు ఏర్పడ్డాయి.అయినా అధికారులు చోద్యాన్ని చూస్తూ,తమకేమీ తెలియనట్లుగా పట్టించుకోవడంలేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.మైనర్లకు మద్యం అమ్మకాలు జరపడం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మైనర్లకు మద్యాన్ని అమ్మిన వైన్స్ షాపుపై తగిన చర్యలు తీసుకోవాలని పలువురు వాపోతున్నారు.

జనంసాక్షి 12 May 2026 - Page 11 https://epaper.janamsakshi.org/clip/489082

**తలకొండపల్లి మే 12 (జనంసాక్షి):** మైనర్లకు మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని జనంసాక్షి ప్రచురించిన వార్త కథనానికి స్పందించిన ఆమనగల్ ఎక్సైజ్ సిఐ బద్రీనాథ్ చౌహాన్, తలకొండపల్లి మండల కేంద్రంలోని సంతోష్ మాత వైన్స్ షాపుపై శాఖా పరమైన చర్యలు చేపట్టారు. మంగళవారం జనంసాక్షి పత్రికలో “మైనర్లకు మద్యం అమ్మకాలు” అనే వార్త ప్రచురితమైన వెంటనే ఎక్సైజ్ అధికారులు సంతోష్ మాత వైన్స్ షాపుకు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా షాపులోని సీసీటీవీ కెమెరా ఫుటేజ్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ఈ విషయంపై జనంసాక్షి మీడియాతో మాట్లాడిన ఆమనగల్ ఎక్సైజ్ సిఐ బద్రీనాథ్ చౌహాన్, “మైనర్లకు మద్యం అమ్మినట్లు రుజువైతే ఎక్సైజ్ శాఖ పరమైన కఠిన చర్యలు తీసుకుంటాం. చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తే షాపు లైసెన్స్‌ను రద్దు చేస్తాం” అని స్పష్టం చేశారు.

అధికారులు షాపు యజమానులకు ఇచ్చిన ముఖ్య సూచనలు:

ఉదయం 10 గంటలలోపు వైన్స్ షాపులు తెరవకూడదు. రాత్రి 10 గంటలకు షాపులు మూసివేయాలి. ఎక్సైజ్ నిబంధనల ప్రకారమే మద్యం విక్రయాలు జరపాలి. దుకాణాల్లో మద్యం తాగడానికి అనుమతించరాదు. అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

మైనర్లకు మద్యం అమ్మకాలు జరగకుండా ఎక్సైజ్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతుందని సిఐ బద్రీనాథ్ చౌహాన్ పేర్కొన్నారు. ఈ విషయంపై ఎక్సైజ్ శాఖ ఇంకా విచారణ చేస్తోంది.

## సనాతన ధర్మ పరిరక్షణలో యువత ముందుండాలి

### బుక్క వేణుగోపాల్



**రాజేంద్రనగర్,మే12(జనంసాక్షి) :** శ్రీరాముడిపై అచంచల భక్తితో దేవత్వాన్ని పొందిన మహోన్నత దైవమని, శ్రీరాముడు చూపిన ధర్మమార్గమే మానవ జీవితానికి పరమార్థమని ప్రపంచానికి చాటి చెప్పిన రామదూతుడిగా హనుమంతుడు నిలిచాడని బిజెపి సీనియర్ నాయకుడు బుక్క వేణుగోపాల్ పేర్కొన్నారు. మంగళవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ మండలంలోని నర్కూడ గ్రామం అమ్మపల్లి దేవాలయం ఆవరణలో హనుమాన్ జయంతోత్సవం సందర్భంగా శ్రీ అభయ అభయాంజనేయ స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు బుక్క వేణుగోపాల్ కుటుంబ సమేతంగా పాల్గొని స్వామివారిని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమంతుడి భక్తి, ధైర్యం, సేవా తత్వం యువతకు ఆదర్శమని పేర్కొంటూ, దేశభక్తి, ధర్మ పరిరక్షణ రెండూ కలిసే సమాజ అభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. ప్రతి యువకుడు సమాజ సేవా కార్యక్రమాల్లో పాల్గొని ధార్మిక చైతన్యాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాగేష్ గౌడ్ కుటుంబ సమేతంగా పాల్గొనగా, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దైవ దర్శనం చేసుకున్నారు.




## ఘనంగా లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సేవాదళ్ నూతన క్లబ్ ఇన్‌స్టాలేషన్

**కాప్రా, మే 12 (జనం సాక్షి) :** లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సేవాదళ్ నూతన క్లబ్ ఏర్పాటు మరియు ఇన్‌స్టాలేషన్ కార్యక్రమం సోమవారం కమలానగర్‌లోని కాపు భవన్‌లో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320సి డిస్ట్రిక్ట్ గవర్నర్ కె. ఇన్నా రెడ్డి, ఎండి -320 ఎల్ సి ఐ ఎఫ్ కోఆర్డినేటర్ కె. హరీష్ రెడ్డి, డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలెక్ట్ కల్లెం కృష్ణారెడ్డి, ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలెక్ట్ డా. మండా సురేష్ కుమార్, సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలెక్ట్ లయన్ జి.శేఖర్ రెడ్డి తదితర ప్రముఖులు హాజరయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన “లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సేవాదళ్” క్లబ్‌ను అధికారికంగా ప్రారంభించి, నూతన సభ్యులకు అభినందనలు తెలిపారు. సమాజ సేవే లక్ష్యంగా ప్రతి సభ్యుడు నిబద్ధతతో ముందుకు సాగాలని, సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి మరింత చేరువ కావాలని అతిథులు పిలుపునిచ్చారు. అనంతరం నూతన క్లబ్ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి, సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రవి కుమార్ యాదవ్, సంపత్ గౌడ్, ఏవీఆర్ దత్తు, శ్యాంసుందర్, కృష్ణవేణి, ఇతర నాయకులు, సభ్యులు మరియు లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సేవాదళ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భవనంపై నుండి పడి పెయింటర్ మృతి

**హయత్ నగర్, మే 12 (జనం సాక్షి) :** వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని జహాంగీర్ నగర్ లో నివాసం ఉంటున్న ఉత్తర్ ప్రదేశ్ కి చెందిన వీరేంద్ర ప్రసాద్, 41 సం.లు, ప్రణవ్ కన్స్ట్రక్షన్ బిల్డింగ్‌లో సోమవారం రోజున పెయింటింగ్ పనులు చేస్తుండగా అయిదవ అంతస్తు పై నుండి కింద పడి అక్కడికక్కడే మృతి చెందినాడు. కన్స్ట్రక్షన్ సైట్ మేనేజర్ కదురి అశోక్ కుమార్ నిర్లక్ష్యం కారణంగానే బిల్డింగ్ పై నుండి పడి చనిపోయినాడని, మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, వనస్థలిపురం ఎస్హెచ్ఓ రవిబాబు తెలిపారు.

## శేరిలింగంపల్లి అభివృద్ధే అంతిమ లక్ష్యం

- 2.84 కోట్లతో సీసీ రోడ్లు, స్మశాన వాటిక అభివృద్ధి
- గచ్చిబౌలి డివిజన్‌లో శంకుస్థాపన చేసిన పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ
- ప్రజల సంక్షేమం, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం
- నానక్‌రామ్‌గూడ స్మశాన వాటిక 80 లక్షలు, సీసీ రోడ్లకు 2.04 కోట్లు
- రేవంత్ మార్గదర్శకత్వంలో నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం



**శేరిలింగంపల్లి, మే 12 (జనంసాక్షి):** శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి, ప్రగతి పథంలో అద్భుతంగా నడిపించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) చైర్మన్ అరికెపూడి గాంధీ స్పష్టం చేశారు. గచ్చిబౌలి డివిజన్‌లోని వివిధ కాలనీల అభివృద్ధికి 2 కోట్ల 84 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, స్మశాన వాటిక అభివృద్ధి పనులకు మంగళవారం ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నానక్ రామ్ గూడ, దర్గా వెస్టన్ ప్లాజా కాలనీల్లో 2.04 కోట్ల రూపాయలతో నూతన సీసీ రోడ్ల నిర్మాణం మరియు నానక్ రామ్ గూడ స్మశాన వాటిక అభివృద్ధికి 80 లక్షల రూపాయలతో చేపట్టే పనులకు అరికెపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. ప్రజల సంక్షేమం, నియోజకవర్గంలోని అన్ని కాలనీల అభివృద్ధే తమ ధ్యేయమని, ప్రతి బస్తీ, కాలనీలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తానని ఆయన హామీ ఇచ్చారు. నానక్ రామ్ గూడ స్మశాన వాటికను అన్ని రకాల మౌలిక సదుపాయాలతో సుందరంగా తీర్చిదిద్ది, ఆహ్లాదకరమైన ప్రశాంత వాతావరణం కల్పించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా అంత్యక్రియలు సజావుగా జరగేలా చేస్తామని గాంధీ వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో, రంగారెడ్డి జిల్లా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, అగ్రభాగాన నిలబెడతామని భరోసా ఇచ్చారు. నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించిన అరికెపూడి గాంధీ, త్వరితగతిన పనులు పూర్తి చేసి సౌకర్యాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని పునరుద్ఘాటించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు, అసోసియేషన్ సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కోఆప్షన్ సభ్యుల ఎంపికకు ముహూర్తం ఖరారు

### మాజీ కౌన్సిలర్లకు, టిక్కెట్ వదులు కున్నవారికే ప్రాధాన్యం.



**తాండూరు మే 12(జనంసాక్షి):** మున్సిపల్ కోఆప్షన్ ఎన్నికకు ముహూర్తం ఖరారు చేశారు.

బుధవారం మున్సిపల్ కార్యాయలంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి కోఆప్షన్ సభ్యులను ఎన్నుకోబోతున్నారు.కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ కౌన్సిలర్లతో పాటు ఎన్నికల్లో టిక్కెట్ త్యాగం చేసిన వారికి సభ్యులుగా అవకాశం కల్పిస్తున్నట్లు తెలిసింది. కోఆప్షన్ సభ్యులుగా 14వ వార్డు నుంచి మాజీ కౌన్సిలర్ సరితా హరిగౌడ్‌కు అవకాశం కల్పిస్తున్నారు. 15వ వార్డు నుంచి పాత తాండూరుకు చెందిన సీనీయర్ స్వర్గీయ నాయకులు పెంటయ్య కుమారుడు సుభాష్‌ను ఎన్నుకోబోతున్నారు. అదే విధంగా పట్టణంలోని 17వ వార్డు నుంచి మాజీ కౌన్సిలర్ ఆఫ్రీన్ జవేరియాను ఎన్నుకుంటున్నారు. దీంతో పాటు మైనార్టీ కోటాలో పట్టణంలోని సాయిపూర్ 10వ వార్డు నుంచి కౌన్సిలర్ టిక్కెట్‌ను త్యాగం చేసిన మహమ్మద్ రహీంకు అవకాశం కల్పిస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీకి చెందిన టిక్కెట్‌ను త్యాగం చేసిన మాజీ కౌన్సిలర్లతో పాటు మైనార్టీ నాయకుడికి కోఆప్షన్ సభ్యులుగా ఎన్నుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి కోఆప్షన్ సభ్యులను ఎన్నుకోబోతున్నారు.

## మత్స్యకార సంఘం ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతుదారులు ఘన విజయం

### ఉత్కంఠ రేపిన రాంపూర్ మత్స్యకార సొసైటీ ఎన్నికలు

**తలకొండపల్లి మే12(జనంసాక్షి):**

రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలోని సూర్యరావు చేపల చెరువు మత్స్యకారుల సొసైటీ ఎన్నికలు మంగళవారం జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ కో-ఆపరేటివ్ సొసైటీ అధికారి ఆర్.విజయ ఆధ్వర్యంలో ప్రశాంతంగా జరిగాయి. రాంపూర్ గ్రామంలోని ముదిరాజ్ సంఘం భవనంలో పోలీస్ బందోబస్తు మధ్యన మత్స్యకార సొసైటీ ఎన్నికలను నమూనా బ్యాలెట్ పేపర్ ద్వారా నిర్వహించారు.ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు అధికారులు ఎన్నికల కౌంటింగ్ నిర్వహించారు.ఈ ఉత్కంఠ ఎన్నికల పోరులో 17 మంది అభ్యర్థులు మత్స్యకార సొసైటీ ఎన్నికల్లో పోటీ చేయగా బీఆర్ఎస్ మద్దతుదారులు 8 మంది అభ్యర్థులు డైరెక్టర్లుగా గెలుపొంది విజయ దంకా మోగించారు.కేవలం ఒక్క అభ్యర్థి మాత్రమే కాంగ్రెస్ మద్దతుదారుడు గెలుపొందారు.ఈ మేరకు గెలుపొందిన వారికి ధ్రువీకరణ పత్రాలను అధికారులు అందజేశారు.



విజేతలు వీరే చిల్కం శేఖర్, చిల్కం బిక్షపతి, పప్పిడి జంగయ్య, తిక్కల మహేష్, సప్పిడి కృష్ణయ్య, తిక్కల యాదయ్య, సప్పిడి రమేష్, మియ్యాడి అమృత, సప్పిడి యాదమ్మలు ఉత్కంఠ రేపిన ఎన్నికల పోరులో మత్స్యకార సొసైటీ డైరెక్టర్లుగా విజయం సాధించారు.ఈ సందర్భంగా గెలుపొందిన డైరెక్టర్ల,ను గ్రామ సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్,ఉపసర్పంచ్ సప్పిడి ఆంజనేయులు,తో పాటు గ్రామ నాయకులు అభినందనలు తెలిపారు.అనంతరం గ్రామంలో సంబరాలు జరుపుకున్నారు.ఈ ఎన్నికల ప్రక్రియ కార్యక్రమంలో కో-ఆపరేటివ్ ఇన్ స్పెక్టర్ గోపీనాథ్,జూనియర్ అసిస్టెంట్లు సంతోష్ కుమార్, విజయకాంత్, ముదిరాజ్ నాయకులు జానయ్య, రమేష్, ఫకీర, మహేష్, శివకుమార్, శ్రీను, తదితరులు ఉన్నారు.